# పెన్ పవర్

ప్రకటన కర్తలకు, పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి

11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

CELEBRATING 11TH YEAR ANNIVERSARY

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 12 సంచిక : 70 పేజీలు :12 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : విశాఖపట్నం | ఆదివారం 16 నవంబర్ 2025 | వెల : 5/-రూ ॥

VOLUME :12 ISSUE :70 PAGES :12 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : VISAKHAPATNAM | SUN 16 NOVEMBER 2025 | PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




# విశాఖ సదస్సు అంచనాలకు మించి అద్భుత విజయం...

## 3 రోజుల్లో రూ. 13 లక్షల కోట్ల పెట్టుబడులు

- విశాఖలో విజయవంతంగా ముగిసిన సీఐఐ భాగస్వామ్య సదస్సు
- మూడు రోజుల్లో రూ.13.25 లక్షల కోట్ల విలువైన పెట్టుబడుల ఒప్పందాలు
- అంచనాలకు మించి 30 శాతం అధికంగా తరలివచ్చిన పెట్టుబడులు
- ఈ ఒప్పందాల ద్వారా 16.31 లక్షల ఉద్యోగాల కల్పనకు అవకాశం
- ఇంధన, పరిశ్రమల, మౌలిక వసతుల రంగాలకు అత్యధిక వాటా
- సగానికి పైగా ఒప్పందాలు ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలోనే ఖరారు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతిలో విశాఖ సాగర తీరం సరికొత్త చరిత్రను లిఖించింది. రాష్ట్ర ప్రభుత్వం, సీఐఐ సంయుక్తంగా నిర్వహించిన 30వ భాగస్వామ్య సదస్సు అంచనాలకు మించి అద్భుత విజయం సాధించింది. రాష్ట్రానికి పెట్టుబడుల సునామీని తీసుకొచ్చింది. మూడు రోజుల పాటు జరిగిన ఈ సదస్సులో ఏకంగా రూ.13,25,716 కోట్ల విలువైన పెట్టుబడులపై ఒప్పందాలు (ఎంఓయూలు) కుదిరాయి. ఈ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో 16,31,188 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

**అంచనాలకు మించి పెట్టుబడుల వెల్లువ**

వాస్తవానికి ఈ సదస్సును రెండు రోజుల పాటు నిర్వహించాలని ప్రభుత్వం మొదట భావించింది. సుమారు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేసింది. అయితే, పారిశ్రామికవేత్తల నుంచి అనూహ్య స్పందన రావడంతో సదస్సును మరో రోజు పొడిగించాల్సి వచ్చింది. పెట్టుబడులు పెట్టేందుకు దేశ, విదేశీ సంస్థలు భారీగా తరలిరావడంతో అంచనాలను మించి ఏకంగా 30 శాతం అధికంగా, అంటే రూ.13 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు రాష్ట్రానికి రావడం ప్రభుత్వ వర్గాల్లోనూ కొత్త ఉత్సాహాన్ని నింపింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచే ముఖ్యమంత్రి చంద్రబాబు పారిశ్రామికాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. క్రమం తప్పకుండా రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశాలు నిర్వహిస్తూ పరిశ్రమలకు శరవేగంగా అనుమతులు మంజూరు చేశారు.

వివరాలు 2లో..

## సూపర్ స్టార్ కృష్ణ వర్ధంతి సందర్భంగా జగన్ ట్వీట్



- దివంగత నటుడు సూపర్ స్టార్ కృష్ణకు నివాళులర్పించిన వైఎస్ జగన్
- కృష్ణ వర్ధంతి సందర్భంగా సోషల్ మీడియాలో పోస్ట్
- తెలుగు సినిమాకు నూతన మార్గాలు చూపిన గొప్ప నటుడని కితాబు
- ఎన్నో ప్రయోగాలు చేసిన సాహసిగా అభివర్ణన
- ఇండస్ట్రీలో ఎందరికో అండగా నిలిచిన మానవతావాది అని ప్రశంస

వివరాలు 2లో..

## ఏపీలో పెట్టుబడుల సునామీ...

### సెమీకండక్టర్ల నుంచి షిప్ యార్డ్ వరకు కీలక ఒప్పందాలు

- ఏపీలో సెమీకండక్టర్, చిప్ డిజైనింగ్ యూనిట్ ఏర్పాటుకు సిలికాన్ జెన్ కు ఆహ్వానం
- క్వాంటం టెక్నాలజీలో దేశానికి ఏపీ మార్గదర్శనం చేస్తుందన్న మంత్రి లోకేశ్
- రూ.5 వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ షిప్ బిల్డింగ్ కాంప్లెక్స్ ఏర్పాటుకు గోవా షిప్ యార్డ్స్ సుముఖత
- అమరావతిలో 12 ఎకరాల్లో ఏఐఎఫ్ఎఫ్ ఫుట్ బాల్ స్టేడియం నిర్మాణం
- పునరుత్పాదక ఇంధన రంగంలో పెట్టుబడులకు జెలెస్ట్రా పవర్ కు విజ్ఞప్తి
- శ్రీకాకుళం ఎయిర్ పోర్టు నిర్మాణానికి ఏఏఐ, ఏపీఏడీసీ మధ్య కీలక ఒప్పందం



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సమగ్రాభివృద్ధి పథంలో నడిపించేందుకు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం వ్యూహాత్మ కంగా అడుగులు వేస్తోంది.

వివరాలు 2లో..

## సీఐడీ విచారణకు హాజరైన రానా, యాంకర్ విష్ణుప్రియ

- ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసులో వేగవంతమైన విచారణ
- రానా, విష్ణుప్రియ స్టేట్‌మెంట్లు రికార్డ్ చేసిన అధికారులు
- ఇప్పటికే నటుడు ప్రకాశ్ రాజ్‌ను విచారించిన సీఐడీ



పెన్ పవర్ డెస్క్:ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్‌ల ప్రమోషన్ కేసులో సీఐడీ దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. ఈ కేసుకు సంబంధించి ప్రముఖ నటుడు రానా దగ్గుబాటి, యాంకర్ విష్ణుప్రియ ఈరోజు సీఐడీ సిట్ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. హైదరాబాద్‌లోని సీఐడీ కార్యాలయంలో అధికారులు వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేశారు. యాంకర్ విష్ణుప్రియ మూడు బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్

వివరాలు 2లో..

## అభివృద్ధి చేసింది ఎవరు? అధోగతి పాలుచేస్తున్నది ఎవరు? మీరే గమనించండి

- కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధికార ప్రతినిధి శ్యామల విమర్శలు
- జగన్ హయాంలో విద్య, వైద్యానికి పెద్దపీట వేశామని వెల్లడి
- ప్రస్తుత ప్రభుత్వం విద్య, వైద్యాన్ని పేదలకు దూరం చేస్తోందని విమర్శ



పెన్ పవర్ డెస్క్:కూటమి ప్రభుత్వంపై వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యాంకర్ శ్యామల తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గతంలో తమ అధినేత జగన్మోహన్ రెడ్డి విశాఖను బెంగుళూరు,

వివరాలు 2లో..

## కులతత్వ విషం, ముస్లింలీగ్-మావోయిస్టు కాంగ్రెస్‌ను ప్రజలు తిరస్కరించారు

- దశాబ్దకాలంగా ఓటములపై కాంగ్రెస్ ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచన
- మాజీ ప్రధానులతో పని చేసిన కాంగ్రెస్ సీనియర్లు రాహుల్ గాంధీ తీరుతో అసంతృప్తిగా ఉన్నారని వ్యాఖ్య
- కులతత్వ విషాన్ని చిమ్ముతున్న వారిని ప్రజలు తిరస్కరిస్తారని మరోసారి రుజువైందన్న మోదీ



పెన్ పవర్ డెస్క్:కులతత్వ విషాన్ని చిమ్మేవారిని, ముస్లిం లీగ్-మావోయిస్టు భావజాలం కలిగిన వారిని బీహార్ ప్రజలు తిరస్కరించారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. సూరత్‌లో స్థిరపడిన బీహారీలు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ, దశాబ్దకాలంగా ఓటములపై కాంగ్రెస్ పార్టీ ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. ముస్లింలీగ్-మావోయిస్టు కాంగ్రెస్‌ను ప్రజలు

వివరాలు 2లో..

## ముఠాల మూలాలు తేల్చండి..

### విశాఖ గోమాంసం ఘటనపై పవన్ కల్యాణ్ సీరియస్

- విశాఖ గోమాంసం నిల్వలపై డిప్యూటీ సీఎం పవన్ సీరియస్
- ముఠాల మూలాలను వెంటనే తేల్చాలని పోలీసులకు ఆదేశం
- నిందితులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరిక
- పోలీస్ కమిషనర్‌తో స్వయంగా మాట్లాడి వివరాలు సేకరణ
- కోల్డ్ స్టోరేజీలో 1.89 లక్షల కిలోల గో మాంసం స్వాధీనం



వివరాలు 2లో..

## విశాఖ సదస్సులో మన చిన్న కమ్మ కల్యాణ్ గారు కనిపించడంలేదంటబ్బా!

- పవన్ కల్యాణ్‌పై అంబటి రాంబాబు సెటైర్
- విశాఖలో జరిగిన సీఐఐ సమ్మిట్‌కు పవన్ ఎందుకు రాలేదని ప్రశ్న
- చంద్రబాబు, లోకేశ్‌లను కూడా తన పోస్టుకు ట్యాగ్ చేసిన అంబటి
- సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారిన అంబటి వ్యాఖ్యలు



పెన్ పవర్ డెస్క్:ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు మరోసారి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. విశాఖపట్నంలో జరిగిన సీఐఐ (భారత పరిశ్రమల సమాఖ్య) భాగస్వామ్య సదస్సును ప్రస్తావిస్తూ

వివరాలు 2లో..

## 'ఐ-బొమ్మ' ద్వారా వందల కోట్లు ఆర్జించిన ఇమ్మడి రవి!

- ఐ-బొమ్మ వెబ్‌సైట్ ప్రధాన నిర్వాహకుడు ఇమ్మడి రవి అరెస్ట్
- హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో అదుపులోకి తీసుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు
- కరీబియన్ దీవుల నుంచి పైరసీ నెట్‌వర్క్ నిర్వహణ
- ఐ-బొమ్మ వల్ల ఇండస్ట్రీకి రూ.22 వేల కోట్ల నష్టం అంచనా
- నిందితుడి ఫ్లాట్‌లో హార్డ్ డిస్కులు, హెచ్‌డీ ప్రింట్లు స్వాధీనం
- రెండు రోజుల్లో పూర్తి వివరాలు వెల్లడిస్తామన్న పోలీసులు



వివరాలు 2లో..

పెన్ పవర్ డెస్క్:తెలుగు సినీ పరిశ్రమను దశాబ్దాలుగా పట్టి పీడిస్తున్న పైరసీ భూతాన్ని అంతమొందించే దిశగా హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు గట్టి దెబ్బకొట్టారు. కొత్త సినిమాలు విడుదలైన గంటల వ్యవధిలోనే హెచ్‌డీ ప్రింట్లను ఉచితంగా అందిస్తూ నిర్మాతలకు కంటి మీద కునుకు లేకుండా చేసిన 'ఐ-బొమ్మ' వెబ్‌సైట్ ప్రధాన నిర్వాహకుడు, సూత్రధారి ఇమ్మడి రవిని అరెస్టు చేశారు. ఫ్రాన్స్ నుంచి హైదరాబాద్ చేరుకున్న అతడిని, కూకట్‌పల్లిలోని రెయిన్ విస్టా అపార్ట్‌మెంట్‌లో నవంబర్ 14న చాకచక్యంగా అదుపులోకి




## ఏపీ పాలసీలు అద్భుతం...

### సీఎం చంద్రబాబును ప్రశంసించిన రేమాండ్స్ గ్రూప్



- శ్రీసిటీకి అదనంగా 6 వేల ఎకరాల భూమి కేటాయింపు
- సీఐఐ సదస్సులో వెల్లువెత్తిన పెట్టుబడులు
- రాయలసీమలో రూ.1201 కోట్లతో రేమాండ్స్ గ్రూప్ మూడు ప్రాజెక్టులు
- 18 నెలల కాలంలో రాష్ట్రానికి రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్న సీఎం
- శ్రీసిటీలో రూ.2320 కోట్ల విలువైన కొత్త ఒప్పందాలు
- ఏపీలో పరిశ్రమలకు అనుమతులు వేగంగా వస్తున్నాయన్న రేమాండ్స్ గ్రూప్

వివరాలు 2లో..

# విశాఖ సదస్సు అంచనాలకు మించి అద్భుత విజయం...

- మొదటి పేజి తరువాయి

దీనికి కొనసాగింపుగా, రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి స్వయంగా సింగపూర్, యూఏఈ, లండన్ వంటి దేశాల్లో పర్యటించి పారిశ్రామికవేత్తలను సదస్సుకు ఆహ్వానించారు. ఈ కృషి ఫలించి భాగస్వామ్య సదస్సు రికార్డు స్థాయి విజయాన్ని నమోదు చేసింది.

**ముఖ్యమంత్రి సమక్షంలో అధిక శాతం ఒప్పందాలు**

మూడు రోజుల పాటు జరిగిన ఈ పెట్టుబడుల మేళాలో సింహభాగం ఒప్పందాలు ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలోనే జరగడం విశేషం. మొత్తం 123 ఎంఓయూల ద్వారా రూ.7,63,210 కోట్ల పెట్టుబడులు సీఎం సమక్షంలోనే ఖరారయ్యాయి. ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సహా ఇతర మంత్రులు కూడా తమ వంతు కృషి చేసి 490 ఎంఓయూల ద్వారా రూ.5,62,506 కోట్ల పెట్టుబడులను సాధించారు. సదస్సులో తొలి రోజు రూ.3.65 లక్షల కోట్లు, రెండో రోజు రూ.3.49 లక్షల కోట్లు, చివరి రోజు రూ.48,430 కోట్ల విలువైన ఒప్పందాలు కుదిరాయి.

**ప్రధాన రంగాలకు పెద్దపీట**

ఈ సదస్సు ద్వారా మొత్తం 12 కీలక రంగాల్లోకి పెట్టుబడుల ప్రవాహం రానుంది. ఇందులో ఇంధన, పరిశ్రమలు, మౌలిక వసతుల రంగాలు అత్యధిక పెట్టుబడులను ఆకర్షించాయి. రంగాల వారీగా వివరాలు ఇలా ఉన్నాయి:

విద్యుత్ రంగం - రూ. 5,33,351 కోట్ల పెట్టుబడులు %-% 2,66,722 మందికి ఉద్యోగాలు

పరిశ్రమలు %-% రూ. 2,80,384 కోట్ల పెట్టుబడులు %-% 5,19,083 మందికి ఉద్యోగాలు

మౌలిక వసతులు %-% రూ. 2,01,758 కోట్ల పెట్టుబడులు %-% 3,06,649 మందికి ఉద్యోగాలు

ఐటీఈ అండ్ సీ %-% రూ. 1,59,467 కోట్ల పెట్టుబడులు - 2,96,315 మందికి ఉద్యోగాలు

ఏపీ సీఆర్డీఏ %-% రూ. 48,711 కోట్ల పెట్టుబడులు %-% 41,625 మందికి ఉద్యోగాలు

టూరిజం %-% రూ. 21,036 కోట్ల పెట్టుబడులు %-% 1,05,804 మందికి ఉద్యోగాలు

ఫుడ్ ప్రాసెసింగ్ %-% రూ. 13,008 కోట్ల పెట్టుబడులు - 47,390 మందికి ఉద్యోగాలు

పట్టణాభివృద్ధి %-% రూ. 4,944 కోట్ల పెట్టుబడులు - 12,150 మందికి ఉద్యోగాలు

టెక్స్ టైల్స్ %-% రూ. 4,490 కోట్ల పెట్టుబడులు - 8,450 మందికి ఉద్యోగాలు

వైద్యారోగం %-% 4,208 కోట్ల పెట్టుబడులు %-% 24000 మందికి ఉద్యోగాలు

విద్యా రంగం %-% రూ. 4,359 కోట్ల పెట్టుబడులు - 3,000 మందికి ఉద్యోగాలు

ఇతర శాఖలు %-% రూ. 50,000 కోట్ల పెట్టుబడులు

మొత్తం మీద, విశాఖ భాగస్వామ్య సదస్సు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పారిశ్రామిక విధానాలకు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వానికి లభించిన గొప్ప విజయంగా నిలుస్తోంది. ఈ ఒప్పందాలు క్షేత్రస్థాయిలో కార్యరూపం దాలిస్తే రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రం మారడంతో పాటు, నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## ఎడిటర్ వ్యూ

### విశాఖ సదస్సులో మన చిన్న కమ్మ కల్యాణ్ గారు

# కనిపించడంలేదంటబ్బా!

- మొదటి పేజి తరువాయి

ఆయనపై సోషల్ మీడియా వేదికగా సెటైర్లు వేశారు.తన అధికారిక ఎక్స్ ఖాతాలో అంబటి రాంబాబు నేడు ఓ పోస్ట్ పెట్టారు. "విశాఖపట్నంలో ఆర్భాటంగా జరిగిన %జ××% సమ్మిట్‌లో మన చిన్న కమ్మ కల్యాణ్ గారు కనిపించలేదేంటబ్బా! అని ఆయన ప్రశ్నించారు. ఈ ట్వీట్‌కు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌తో పాటు పవన్ కల్యాణ్‌ను కూడా ఆయన ట్యాగ్ చేశారు.

### కులతత్వ విషం, ముస్లింలీగ్-మావోయిస్టు

# కాంగ్రెస్‌ను ప్రజలు తిరస్కరించారు

- మొదటి పేజి తరువాయి

తిరస్కరించారని ఆయన అన్నారు.మాజీ ప్రధానులు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలతో పనిచేసిన కాంగ్రెస్ జాతీయ నాయకులు కూడా రాహుల్ గాంధీ వ్యవహారశైలితో తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ మిత్రపక్షాలు, కార్యకర్తలకు కూడా పరాజయం గురించి వివరించే పరిస్థితి ఆ పార్టీలో లేదని ఆయన విమర్శించారు.

ఈవీఎంలు, ఎన్నికల సంఘం, ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను నిందించే సులభ మార్గాన్ని కాంగ్రెస్ పార్టీ ఎంచుకుందని ఆయన అన్నారు. కులతత్వ విషాన్ని చిమ్ముతున్న వారిని ప్రజలు తిరస్కరిస్తారని బీహార్ ఎన్నికలు మరోసారి రుజువు చేశాయని ఆయన అన్నారు. దళితులు అధికంగా ఉండే 38 స్థానాల్లో ఎన్డీయే 34 స్థానాలను గెలుచుకుందని ఆయన తెలిపారు.

# ఏపీలో పెట్టుబడుల సునామీ...

- మొదటి పేజి తరువాయి

ముఖ్యంగా టెక్నాలజీ, పారిశ్రామిక, మౌలిక సదుపాయాల రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ఇందులో భాగంగా రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ విశాఖపట్నం వేదికగా పలు దిగ్గజ సంస్థల ప్రతినిధులతో సమావేశమై రాష్ట్ర ప్రభుత్వ విధానాలను, అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించారు. మరోవైపు, ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలకమైన శ్రీకాకుళం ఎయిర్ పోర్టు నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఒప్పందం కుదరడం విశేషం.

**టెక్నాలజీలో ఏపీని అగ్రగామిగా నిలబెట్టే దిశగా...**

క్వాంటం టెక్నాలజీ రంగంలో దేశాన్ని ముందుండి నడిపించే సత్తా ఆంధ్రప్రదేశ్‌కు ఉందని మంత్రి నారా లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. విశాఖలో సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రాంగణంలో 'ఆత్మనిర్భర్ క్వాంటం' అంశంపై జరిగిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, "ఏదైనా అమలు చేయాలంటే ముందు ఒక కల ఉండాలి. మేం కేవలం కలలు కనడమే కాదు, వాటిని సాకారం కూడా చేస్తాం. అందుకే దేశంలోనే తొలిసారిగా క్వాంటం మిషన్, యాక్షన్ ప్లాన్, రోడ్ మ్యాప్ రూపొందించాం" అని అన్నారు.

అమరావతిలో ఏర్పాటు చేయనున్న 'క్వాంటం వ్యాలీ'కి నాలుగు మూలస్తంభాలు ఉన్నాయని, అవి.. క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, ప్రతిభావంతులైన ఎకోసిస్టమ్ నిర్మాణం, హార్డ్‌వేర్ తయారీ అని వివరించారు. ఈ కార్యక్రమంలోనే ఆంధ్రప్రదేశ్ క్వాంటం కంప్యూటింగ్ పాలసీ (2025-30)ని విడుదల చేశారు. అనంతరం క్వాంటం టెక్నాలజీ రంగంలో 23 సంస్థలతో అవగాహన ఒప్పందాలు (ఎంవోయూలు) కుదిరాయి.ఇదే క్రమంలో, ఎలక్ట్రానిక్స్ సిస్టమ్ డిజైన్, సెమీకండక్టర్ల తయారీలో ప్రసిద్ధిగాంచిన సిలికాన్ జెన్ సంస్థ చైర్మన్ చీదా చిదంబరంతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. ఏపీలో సెమీకండక్టర్ల ఫ్యాబ్రికేషన్ (ఫ్యాబ్) యూనిట్, చిప్ డిజైనింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. ఏపీ ఐటీ, సెమీకండక్టర్స్ పాలసీ 2.0 దేశంలోనే అత్యుత్తమ ప్రోత్సాహకాలు అందిస్తోందని వివరించారు. దీనిపై చిదంబరం సానుకూలంగా స్పందిస్తూ, AI GPU\T, %CPUలు, హై-బ్యాండ్‌విడ్త్ మెమరీ వంటి అధునాతన భాగాల తయారీపై తమకు ఆసక్తి ఉందని, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను తమ సంస్థలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

**గోవా షిప్ యార్డ్స్ ప్రాజెక్ట్స్ హెడ్ ఆదికేష్ వాసుదేవన్‌తో మంత్రి లోకేశ్ భేటీ**

రాష్ట్రానికి భారీ పరిశ్రమలను తీసుకురావడంలో భాగంగా గోవా షిప్ యార్డ్స్ ప్రాజెక్ట్స్ హెడ్ ఆదికేష్ వాసుదేవన్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. రూ.5 వేల కోట్ల పెట్టుబడితో ఏపీలో ఇంటిగ్రేటెడ్ షిప్ బిల్డింగ్ రిపేర్ కాంప్లెక్స్ ఏర్పాటుకు ముందుకు వచ్చినందుకు సంస్థను అభినందించారు. దీని ద్వారా సుమారు 20 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగావకాశాలు లభిస్తాయని ఆదికేశ్ తెలిపారు. భారత నావికాదళం, తీర రక్షక దళానికి తమ సంస్థ సేవలు అందిస్తోందని, 1057 కిలోమీటర్ల సువిశాల తీరప్రాంతం ఉన్న ఏపీలో పెట్టుబడి పెట్టడం సరైన నిర్ణయమని మంత్రి పేర్కొన్నారు.అలాగే, పునరుత్పాదక ఇంధన రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు జెలెస్ట్రా పవర్ సీఈఓ పరాగ్ శర్మతో లోకేశ్ భేటీ అయ్యారు. సోలార్ ప్యానెళ్లు, విండ్ టర్బైన్ భాగాలు, బ్యాటరీ స్టోరేజ్ సిస్టమ్స్ కోసం ఏపీలో ఒక తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పోర్టుకు సమీపంలో యూనిట్ ఏర్పాటు చేస్తే ఎగుమతులకు సులభంగా ఉంటుందని సూచించారు. రాష్ట్రంలో ఉన్న విశాలమైన తీరప్రాంతం, రోడ్డు, రైల్వే కనెక్టివిటీ, త్వరలో అందుబాటులోకి రానున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వంటి అంశాలను ఆయన ప్రస్తావించారు.

**అమరావతిలో ఫుట్‌బాల్ స్టేడియం**

పారిశ్రామిక రంగంతో పాటు క్రీడారంగ అభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ చైర్మన్ కల్యాణ్ చౌబేతో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. అమరావతిలో 12 ఎకరాల విస్తీర్ణంలో AIFF ఫుట్‌బాల్ స్టేడియం నిర్మించనున్నట్లు చౌబే ప్రకటించారు. అంతేకాకుండా, పాఠశాల స్థాయి నుంచి ఫుట్‌బాల్‌ను ప్రోత్సహించేందుకు పీఈటీలకు శిక్షణ ఇచ్చేందుకు పాఠశాల విద్యాశాఖతో కలిసి పనిచేస్తామని తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇటీవల డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లో 3 శాతం రిజర్వేషన్ కల్పించామని మంత్రి గుర్తుచేశారు.

**శ్రీకాకుళంలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టు నిర్మాణం**

ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఊతమిచ్చేలా శ్రీకాకుళంలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టు నిర్మాణానికి మార్గం సుగమమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సమక్షంలో ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (AAI), ఏపీ ఎయిర్ పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (%APADC%) మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఎయిర్ పోర్టు నిర్మాణంతో ఉత్తరాంధ్రలో కనెక్టివిటీ పెరిగి పర్యాటక, ఆర్థిక రంగాలు అభివృద్ధి చెందుతాయని సీఎం చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం స్థల పరిశీలన జరుగుతోందని, త్వరలోనే పనులు ప్రారంభమయ్యే అవకాశముందని అధికారులు తెలిపారు.

# ముఠాల మూలాలు తేల్చండి..

విశాఖ నగరంలో భారీ ఎత్తున అక్రమ గోమాంసం నిల్వలు బయటపడిన ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. ఈ దందా వెనుక ఉన్న ముఠాల మూలాలను తక్షణమే వెలికితీయాలని విశాఖ పోలీసులను ఆయన ఆదేశించారు. ఈ వ్యవహారంలో ఎవరి ప్రమేయం ఉన్నా ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఘటన వెలుగులోకి రాగానే ఆయన నేరుగా విశాఖ పోలీస్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఆర్ఐ అధికారులు మిత్రా కోల్డ్ స్టోరేజీలో జరిపిన దాడుల్లో 1.89 లక్షల కిలోల గోమాంసాన్ని స్వాధీనం చేసుకుని, కేసును పోలీసులకు అప్పగించినట్లు కమిషనర్ పవన్ కల్యాణ్‌కు వివరించారు. కోల్డ్ స్టోరేజ్ నిర్వాహకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని తెలిపారు. ఈ మాంసాన్ని ఎక్కడి నుంచి సేకరించారు, ఎక్కడికి తరలించాలని చూశారు, అనుమతుల్లో ఎలాంటి ఉల్లంఘనలు జరిగాయనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోందని కమిషనర్ పేర్కొన్నారు. దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. అక్రమ గోవధ, గోమాంసం విక్రయాలు, ఎగుమతులను ఏ రూపంలోనూ సహించేది లేదని పవన్ తేల్చిచెప్పారు. ఎన్డీయే ప్రభుత్వం గోవధ నిషేధంపై ఎంత పటిష్టంగా పనిచేస్తుందో ఈ ఘటనే నిదర్శనమని అన్నారు. గతంలో తన దృష్టికి రాగానే పిఠాపురంలోని జంతు వధశాలను మూసివేయించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.

# ఏపీ పాలసీలు అద్భుతం...

## సీఎం చంద్రబాబును ప్రశంసించిన రేమాండ్స్ గ్రూప్

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతి పథంలో మరో కీలక ముందడుగు పడింది. రాష్ట్రానికి పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా జరుగుతున్న 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సు వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు పలు కీలక ప్రకటనలు చేశారు. రాష్ట్రంలో ప్రముఖ పారిశ్రామిక టౌన్‌షిప్‌గా ఉన్న శ్రీసిటీకి అదనంగా 6 వేల ఎకరాల భూమిని కేటాయించనున్నట్టు వెల్లడించారు. శ్రీసిటీని రాష్ట్ర అభివృద్ధికి ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని ఆయన స్పష్టం చేశారు. సదస్సు రెండో రోజైన శనివారం సీఎం చంద్రబాబు పలు కార్యక్రమాల్లో పాల్గొని, రాష్ట్ర పారిశ్రామిక ప్రగతిపై తన దార్శనికతను ఆవిష్కరించారు.

సీఐఐ సదస్సు నుంచే ముఖ్యమంత్రి చంద్రబాబు, రేమాండ్స్ గ్రూప్‌కు చెందిన 3 ప్రాజెక్టులకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. అదేవిధంగా, శ్రీసిటీలో ఇప్పటికే కార్యకలాపాలు ప్రారంభించిన 5 కంపెనీలను లాంఛనంగా ప్రారంభించారు. శ్రీసిటీలో కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన పలు సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అవగాహన ఒప్పందాలు (ఎంఓయూలు) కుదుర్చుకున్నారు.ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, "భారతదేశంలోనే అత్యుత్తమ పారిశ్రామిక టౌన్‌షిప్ శ్రీసిటీ. డైకెన్, ఇసుజు, క్యాడ్బరీ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఇక్కడి నుంచే తమ ఉత్పత్తులను ప్రపంచానికి అందిస్తున్నాయి. మరిన్ని అంతర్జాతీయ కంపెనీలు శ్రీసిటీకి రావాలి. ఇప్పటికే బెల్జియం, జపాన్, యూకే, జర్మనీ, ఆస్ట్రేలియా వంటి దేశాలకు చెందిన హెల్త్‌కేర్, ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, మెడికల్ పరికరాల కంపెనీల నుంచి రూ.8.87 లక్షల కోట్ల పెట్టుబడులకు అనుమతులు ఇచ్చాం" అని తెలిపారు.గత రెండు రోజులుగా జరిగిన సదస్సులో రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని, మొత్తంగా తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించామని చంద్రబాబు వివరించారు. "త్వరలోనే శ్రీసిటీకి మరో 6 వేల ఎకరాల భూమిని అందుబాటులోకి తెస్తాం. రాబోయే రోజుల్లో 50కి పైగా దేశాలకు చెందిన కంపెనీలు శ్రీసిటీ నుంచి పనిచేస్తాయి. తద్వారా 1.50 లక్షల మందికి ఉద్యోగాలు లభించి, శ్రీసిటీ ఒక అభివృద్ధి మోడల్‌గా మారుతుంది. దీని సమీపంలోనే ఒక ఎయిర్‌స్ట్రిప్ నిర్మించే ఆలోచన కూడా ఉంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం శ్రీసిటీ తరహా మోడల్స్ రాష్ట్రంలో మరిన్ని రావాలి. దేశంలోనే తొలిసారిగా పారిశ్రామిక ప్రోత్సాహకాల కోసం ఏపీ ప్రభుత్వం ఎస్క్రో ఖాతాను ఏర్పాటు చేస్తోంది. 2028 నాటికి శ్రీసిటీని దేశంలోనే అత్యుత్తమ పారిశ్రామిక ప్రాజెక్టుగా మారుస్తాం" అని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు.

**రాయలసీమ అభివృద్ధికి బాటలు.. 20 లక్షల ఉద్యోగాల లక్ష్యం**

రాయలసీమ అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. "2014-19 మధ్య కాలంలోనే కియా కార్ల ఫ్యాక్టరీని సీమకు తెచ్చాం. ఇప్పుడు అదే ప్రాంతంలో డ్రోన్ సిటీ, స్పేస్ సిటీ వంటివి ఏర్పాటు చేస్తున్నాం. ఏరోస్పేస్, డిఫెన్స్ కారిడార్లు కూడా రాబోతున్నాయి. అనంతపురం జిల్లాకు రేమాండ్స్ సంస్థ రావడం శుభపరిణామం. కియా సమీపంలోనే రేమాండ్స్ ఆటో కాంపోనెంట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న లక్ష్యాన్ని వచ్చే 3-4 ఏళ్లలోనే చేరుకుంటాం. రేమాండ్స్ సంస్థ 2027 నాటికి తమ ప్రాజెక్టులను ప్రారంభిస్తామని హామీ ఇచ్చింది. విమానాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో రేమాండ్స్ ఉత్పత్తులు తయారు చేయడం అభినందనీయం" అని అన్నారు.

**ఏపీ పాలసీలు భేష్: రేమాండ్స్ గ్రూప్ ప్రశంస**

రేమాండ్స్ గ్రూప్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఆ సంస్థ ప్రతినిధి గౌతమ్ మైనీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విధానాలను ప్రశంసించారు. "ఏపీలో పరిశ్రమలకు అనుమతులు చాలా వేగంగా లభిస్తున్నాయి. ఇక్కడి పారిశ్రామిక విధానాలు ఎంతో అనుకూలంగా ఉన్నాయి. రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా మేము ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లోకి అడుగుపెట్టాం. ఈ రంగాల్లో మా గ్రూప్ మరింత బలోపేతం అవుతుంది" అని ఆయన వివరించారు.

**రూ.3,500 కోట్లకు పైగా కొత్త పెట్టుబడులు**

రేమాండ్స్ గ్రూప్ రాష్ట్రంలో మొత్తం రూ.1,201 కోట్ల పెట్టుబడితో మూడు ప్రాజెక్టులను అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేయనుంది. రాప్తాడులో రూ.497 కోట్లతో సిల్వర్ స్పార్క్ అపారెల్ పార్క్, గుడిపల్లిలో రూ.441 కోట్లతో ఆటో కాంపోనెంట్ ప్లాంట్, టెకులోడు వద్ద రూ.262 కోట్లతో ఏరోస్పేస్ పరికరాల తయారీ యూనిట్లను నెలకొల్పనుంది. వీటి ద్వారా ప్రత్యక్షంగా 6,500 మందికి ఉద్యోగాలు రానున్నాయి.

మరోవైపు, శ్రీసిటీలో ఇంజనీరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, ఫార్మా రంగాల్లో 12 ప్రాజెక్టుల ఏర్పాటుకు రూ.2,320 కోట్ల విలువైన ఎంఓయూలు కుదిరాయి. ఈ పెట్టుబడుల ద్వారా మరో 12,365 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ కార్యక్రమాల్లో పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, సీఎస్ కె.విజయానంద్, శ్రీసిటీ ఎండీ రవి సానారెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సూపర్ స్టార్ కృష్ణ వర్ధంతి సందర్భంగా జగన్ ట్వీట్

దివంగత నటుడు, పద్మభూషణ్ సూపర్ స్టార్ కృష్ణ వర్ధంతి సందర్భంగా వైసీపీ అధినేత జగన్ ఆయనకు ఘనంగా నివాళు లర్పించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక సందేశాన్ని పంచుకు న్నారు. కృష్ణ కేవలం గొప్ప నటుడే కాదని, తెలుగు సినీ పరిశ్రమకు సరికొత్త మార్గాలు చూపిన గొప్ప ప్రయోగశీలి అని కొనియాడారు."తెలుగు సినీ పరిశ్రమకు నూతన పంథాలు చూపించి, కోట్లాది మంది అభిమానాన్ని చూరగొన్న గొప్ప నటుడు పద్మభూషణ్ సూపర్ స్టార్ కృష్ణ గారు. ఎప్పుడూ కొత్తదనాన్ని అన్వేషించిన ప్రయోగశీలి ఆయన. తెలుగు సినీ పరిశ్రమలో ఎంతోమందిని ఆదుకున్న గొప్ప మానవతావాది. కృష్ణ గారి వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు" అని జగన్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

కాగా, తెలుగు చలనచిత్ర పరిశ్రమలో తొలి జేమ్స్‌బాండ్, తొలి కౌబాయ్, తొలి సినిమాస్కోప్, స్టీరియోఫోనిక్ సౌండ్, 70ఎంఎం వంటి ఎన్నో సాహసోపేత ప్రయోగాలకు శ్రీకారం చుట్టిన ఘనత సూపర్ స్టార్ కృష్ణకే దక్కుతుంది. ఆయన వర్ధంతి సందర్భంగా సినీ, రాజకీయ ప్రముఖులతో పాటు అభిమానులు కూడా ఆయనను స్మరించుకుంటూ నివాళులు అర్పిస్తున్నారు.

# సీఐడీ విచారణకు హాజరైన రానా, యాంకర్ విష్ణుప్రియ

- మొదటి పేజి తరువాయి

చేసినట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. విచారణలో భాగంగా ఆమె తన బ్యాంకు ఖాతా వివరాలతో పాటు, బ్యాంక్ స్టేట్‌మెంట్లను కూడా సిట్ అధికారులకు సమర్పించినట్లు తెలిసింది. ఈ ప్రమోషన్ల కోసం చేసుకున్న ఒప్పందాలు, వాటి ద్వారా పొందిన ఆదాయంపై అధికారులు ప్రధానంగా దృష్టి సారించారు.ఈ కేసులో మొత్తం 29 మంది టాలీవుడ్ సినీ ప్రముఖులపై కేసులు నమోదయ్యాయి. వీరిలో రానా, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మి, నిధి అగర్వాల్, అనన్య నాగళ్ల, శ్రీముఖి వంటి వారు ఉన్నారు. రెండు రోజుల క్రితమే నటుడు ప్రకాశ్ రాజ్ కూడా సిట్ ఎదుట హాజరై తన వాంగ్మూలాన్ని ఇచ్చారు.హైదరాబాద్, సైబరాబాద్ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా సీఐడీ సిట్ ఈ కేసు దర్యాప్తును చేపట్టింది. రాబోయే రోజుల్లో మరికొంతమంది సెలబ్రిటీలను విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

### అభివృద్ధి చేసింది ఎవరు? అధోగతి పాలుచేస్తున్నది ఎవరు? మీరే గమనించండి

- మొదటి పేజి తరువాయి

చెన్నై, హైదరా బాద్‌తో పోటీపడే నగరంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నారని గుర్తుచేశారు. కానీ కూటమి నేతలు అధోగతి పాలుచేస్తున్నారని వ్యాఖ్యానించారు."బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్ తో పోటీపడే విధంగా విశాఖ నగరాన్ని అభివృద్ధి చేస్తానని జగన్ గారు చెప్పారు. పిల్లలకు మనం ఇచ్చే నిజమైన ఆస్తి విద్య మాత్రమే... అని భావించి, విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. విద్య , వైద్యం పేద మధ్యతరగతి ప్రజలకు అందించడమే లక్ష్యంగా పనిచేశారు.కట్ చేస్తే.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఒకవైపు కల్తీ మద్యాన్ని విస్తరించి, విద్య, వైద్యాన్ని పేద మధ్యతరగతి ప్రజలకు దూరం చేశారు. దీనికి తోడుగా విశాఖ బీచ్ లో భార్యాభర్తలు రెండు పెగ్గులు వేసుకునే సౌకర్యాన్ని కల్పించి , గోవాతో పోటీ పడే విధంగా విశాఖ బీచ్ ఉండాలని అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు అంటున్నారు! రాష్ట్రాన్ని అభివృద్ధి చేసింది ఎవరు? అధోగతి పాలు చేస్తున్నది ఎవరు? మీరే గమనించండి!" అంటూ శ్యామల సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

# 'ఐ-బొమ్మ' ద్వారా వందల కోట్లు ఆర్జించిన ఇమ్మడి రవి!

- మొదటి పేజి తరువాయి

తీసుకున్నారు. ఈ అరెస్టుతో పైరసీ సామ్రాజ్యంలో అతిపెద్ద నెట్‌వర్క్‌లలో ఒకటైన ఐ-బొమ్మ కార్యకలాపాలకు అడ్డుకట్ట పడినట్లయింది.

**పక్కా ప్లాన్‌తో పోలీసుల ఆపరేషన్**

విశాఖపట్నంకు చెందిన ఇమ్మడి రవి, కరీబియన్ దీవులను కేంద్రంగా చేసుకుని ఐ-బొమ్మ వెబ్‌సైట్‌ను నిర్వహిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. నిందితుడు ఫ్రాన్స్ నుంచి నగరానికి వస్తున్నాడన్న పక్కా సమాచారంతో సైబర్ క్రైమ్ పోలీసులు నిఘా పెట్టారు. అతడు కూకట్‌పల్లిలోని తన నివాసానికి చేరుకోగానే దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. రవి ఫ్లాట్‌లో జరిపిన సోదాల్లో కీలకమైన హార్డ్ డిస్కులు, శక్తివంతమైన కంప్యూటర్లు, సర్వర్లకు సంబంధించిన సమాచారం, ఇంకా అప్‌లోడ్ చేయని కొన్ని తాజా సినిమాల హెచ్‌డీ ప్రింట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్ ద్వారా ఐ-బొమ్మ సర్వర్‌లను కూడా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఈ అరెస్టుతో ఐ-బొమ్మ వెబ్‌సైట్‌కు కంటెంట్ అప్‌లోడ్ చేసే ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది.

**రూ.22 వేల కోట్ల నష్టం.. భారీ పైరసీ సామ్రాజ్యం**

ఐ-బొమ్మ ద్వారా ఇమ్మడి రవి వందల కోట్ల రూపాయలు ఆర్జించినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. కేవలం తెలుగు సినిమాల పైరసీ ద్వారానే సినీ పరిశ్రమకు దాదాపు రూ.22 వేల కోట్ల మేర నష్టం వాటిల్లిందని అంచనా వేస్తున్నారు. ఈ వెబ్‌సైట్‌పై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి పలు రాష్ట్రాల్లో కేసులు నమోదయ్యాయి. గతంలో తెలుగు ఫిల్మ్ యాంటీ-పైరసీ విభాగం ఫిర్యాదు చేసినప్పుడు, ఐ-బొమ్మ నిర్వాహకులు తమను పట్టుకోవడం అసాధ్యమంటూ పోలీసులకు బహిరంగంగానే సవాలు విసిరారు. ఈ సవాలును సీరియస్‌గా తీసుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సాంకేతిక ఆధారాలతో నిందితుడిని గుర్తించారు. గతంలో ఈ నెట్‌వర్క్‌కు చెందిన కొందరు ఏజెంట్లను కూడా అరెస్టు చేసినట్లు సమాచారం.

**లోతుగా దర్యాప్తు.. వెలుగులోకి మరిన్ని నిజాలు?**

ప్రస్తుతం ఇమ్మడి రవిని పోలీసులు విచారిస్తున్నారు. ఈ పైరసీ నెట్‌వర్క్‌ను అతడు ఒక్కడే నడిపాడా? లేక అతని వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా? దేశవిదేశాల్లోని అతని నెట్‌వర్క్ ఏ స్థాయిలో విస్తరించింది? అనే కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశారు. మరో రెండు రోజుల్లో విచారణ పూర్తి చేసి, పూర్తి వివరాలను మీడియాకు వెల్లడిస్తామని సైబర్ క్రైమ్ అధికారులు తెలిపారు. ఏదేమైనా, ఈ అరెస్టు సినిమా పరిశ్రమకు పెద్ద ఊరటనిచ్చింది. పైరసీపై సుదీర్ఘకాలంగా చేస్తున్న పోరాటంలో ఇది ఒక కీలక విజయంగా సినీ వర్గాలు భావిస్తున్నాయి.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం। మన్యం। విజయనగరం। విశాఖపట్నం । అనకాపల్లి। అల్లూరి జిల్లా

# అధికారి లేక కాలీగా ఉన్న కుర్చీ





2. ఆనంత గిరి లో ఆర్ డబ్ల్యూఎస్ కార్యాలయం. అందుబాటులో ఉండని ఆర్డబ్ల్యూఎస్ కర్యాలయం అధికారులు అనంతగిరి నవంబర్ 15. పెన్ పవర్ అందుబాటులో ఉండని ఆర్డబ్ల్యూఎస్ అధికారులు అనంతగిరి మండలంలో పలు గ్రామాలలో తాగునీటి సమస్య అధికంగా ఉంది తాగునీటి సమస్య తీర్చాలి అంటూ ఆర్ డబ్ల్యు ఎస్ కార్యాలయంకు పలుమార్లు వెళ్లిన అక్కడ అధికారులు అందుబాటులో ఉండటం లేదని అనంత గిరి మండలంలో పలు గ్రామాల గిరిజనులు తెలుపుతున్నారు. ప్రధానంగా మారుమూల గ్రామాలలో తాగు నీటి సమస్య అధికంగా ఉందని తాగు నీటి సమస్యలపై వినతి పత్రం అందించేందుకు పలుమార్లు కార్యాలయం కి వెళ్ళిన అధికారులు అందుబాటులో ఉండటం లేదని పలు గ్రామాల గిరిజనులు ఆరోపిస్తున్నారు. ఆర్ డబ్ల్యూఎస్ కార్యాలయములో సిబ్బంది తప్ప అధికారులు ఎప్పుడు లేని పరిస్థితి ఏర్పడిందని, పై అధికారుల స్పందించి తాగునీటి సమస్య తీర్చాలని పలు గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

ఆర్ డబ్ల్యూఎస్ ఈ ఈ నాగేశ్వరరావుకు వివరణ కోరగా డీఈ, జెఈ ఎక్కడికి వెళ్లారు అన్నది నా నోటిలో లేదని ఎంక్వయిరీ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.



# స్వాతంత్ర్య సమరయోధుడు మాగ కిర్సాని విగ్రహా ఏర్పాటుకు కృషి చేస్తామన్న కలెక్టర్

**మాగ కిర్సాని విగ్రహా ఏర్పాటుకు కృషి చెయ్యాలని కలెక్టర్ కు వినతి పత్రం.**

**జిల్లా కలెక్టర్ హామీతో మాగ కీర్సాని వారసులు హర్షం.**

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, నవంబరు 15.** భారత స్వాతంత్ర్య సమరయోధుడు మాగ కిర్సాని విగ్రహా ఏర్పాటుకు కృషి చేస్తామని, ఆయన స్వాతంత్ర్య పోరాటానికి చేసిన కృషిని పరిశోధన చేస్తామని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరు ఎ ఎస్ దినేష్ కుమార్ హామీ ఇచ్చినట్లు మాగ వారసులు కిరసాని జినబందు, కిరసాని రామదాసు, కిరాసాని లైకొన్, కిరసాని పద్మనాభం తెలిపారు. ఈ సంధర్భంగా శనివారం వారు పాత్రికేయులకు తెలిపిన వివరాల ప్రకారం.. ఫ్రీడమ్ ఫైటర్ మాగ కీర్సానికు ప్రభుత్వం గుర్తించాలని, తన విగ్రహ ఏర్పాటుకు కృషి చెయ్యాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టరుకు వినతి పత్రం సమర్పించామని తెలిపారు. భారత స్వాతంత్రోద్యమంలో బ్రిటిష్ పాలన నుండి విముక్తి పొందడానికి పోరాటం చేశారని, ఆదివాసి గిరిజన ప్రాంతంలో బ్రిటిష్ సైనిక అధికారులు గిరిజనులపై కొనసాగిస్తున్న బానిసత్వాన్ని, వెట్టిచాకిరిని, బ్రిటిష్ అధికారుల పెతనానికి వ్యతిరేకంగా ఉద్యమం కొనసాగించిన విప్లవ వీరులు అల్లూరి సీతారామరాజు, మల్లు దొర, గంటం దొర, మగ్రికామయ్య వంటి అనేక మందితో కలిసి పోరాటంలో మాగ కిర్సాని కొనసాగారని తెలిపారు. అణగారిన వర్గాల కొరకు పోరాడి, బ్రిటిషర్ల దురాగతలపై, నిర్బంధ వ్యవస్థలపై తిరుగుబాటుకు ప్రతిగా జైలు జీవితం గడిపారన్నారు. జన్ జాతీయ దివాస్ భగవాన్ బిర్సా ముండా 150 వ జయంతి సందర్బంగా స్వాతంత్ర్య సమరయోధుడు మాగ కిర్సానికు గుర్తించాలన్నారు. 1922 సంవత్సరంలో చింతపల్లి, కృష్ణ దేవిపేట, రాజహొమంగి పోలీస్ స్టేషన్ లపై విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు ఆధ్వర్యంలో జరిగిన దాడుల గిరిజన దళంలో మాగ కిర్సాని ఒకరన్నారు. స్వాతంత్ర్యం తెచ్చే క్రమంలో ఆయన పొందిన శిక్షలు అనేకమని, కుటుంబాన్ని సైతం విడిచిపెట్టి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని, గిరిజనుల హక్కుల కోసం అటవీ చట్టాలకు వ్యతిరేకంగా ఉవ్వెత్తున ఉద్యమాన్ని చేపట్టారన్నారు.



గిరిజనుల అణచివేతలపై పోరాడాలని అనేకమందిని సమకూర్చి గిరిజన ప్రాంతంలో గ్రామ గ్రామాన సమావేశాలు నిర్వహించి ప్రజలను చైతన్య పరుస్తూ ఉద్యమాన్ని ముందుకు సాగించారని తెలిపారు. 1922 సంవత్సరంలో చింతపల్లి పరిధిలో పలు పోలీస్ స్టేషన్లపై దాడులు చేసిన గిరిజన దళంలో సభ్యులుగా ఉండటంతో మాగ కిర్సాని కు పోలీసుల గాలింపులు అధికమయ్యాయి. బ్రిటిషర్ల గాలింపులు నేపథ్యంలో గిరిజన ప్రాంతంలోని వివిధ ప్రాంతాల్లో అజ్ఞాతంలో ఉంటూ కొండలో గుహలో తల దాచుకుంటూ, అడవుల్లో ప్రత్యేక స్థావరాలను ఏర్పాటు చేసుకుని బ్రిటిషర్లపై పోరాటం కొనసాగించారని, అజ్ఞాతంలో ఉంటూ ఆయన తలదాచుకొనే క్రమంలో వల్లయిబీరు గ్రామంలో ఉండగా బ్రిటిష్ సైనికులు గ్రామంలో చొరబడి మాగ కిర్సానిపై దాడి చేసి బంధించారన్నారు. మాగ కిర్సాని జైలు పాలవడంతో కుటుంబ సభ్యులను లబ్బూరు గ్రామంలో గల తమ బంధువులు చేరదీశారని, ఆయన జైలు శిక్ష అనంతరం తమ బంధువుల ఊరి లబ్బూరులోనే తమ చివరి శేషజీవితాన్ని గడిపారన్నారు. జైలు శిక్ష అనంతరం తమ పోరాటాన్ని విడిచిపెట్టక లబ్బూరు గ్రామం నుండే బ్రిటిషర్లపై పోరాటం కొనసాగించాడన్నారు. స్వాతంత్ర్యం అనంతరం శేషజీవితాన్ని గడిపి వృద్ధాప్యంలో ఆయన మరణించారన్నారు. భారత స్వాతంత్ర్యం అనంతరం 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మాగ కిర్సాని పేరిట భారత ప్రభుత్వం శిలాఫలకాని మంజూరు చేసిందని, ముంచంగిపుట్టు మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆయన శిలాఫలకాని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. జిల్లా కలెక్టర్ మాగ కీర్సాని విగ్రహా ఏర్పాటుకు, ఆయన స్వాతంత్ర్య పోరాట విషయాలను పరిశోధన చేస్తామన్నడం ఆనందంగా ఉందని వారు తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుడు మాగ కిర్సాని కొరకు కొన్ని పత్రికలు, టీవీ చానల్ ప్రసారం చేయడం పట్ల మాగ వారసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాగ కిర్సాని వారసులతో పాటు మాగ కీర్సాని మేన్నల్లుడు మాజీ సర్పంచ్ వంతాల రామస్వామి, టీడిపి మండల అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ, టీడిపి అరకు పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పాంగి శాస్త్రీబాబు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో రూ.5 వేల కోట్ల షిప్ బిల్డింగ్ కాంప్లెక్స్

- 20 వేల ఉద్యోగాలకు మార్గం
- మంత్రి నారా లోకేష్‌తో గోవా షిప్‌యార్డ్స్ ప్రాజెక్ట్ హెడ్ ఆదికేష్ భేటీ






**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 15** :ఆంధ్రప్రదేశ్‌లో ఇంటిగ్రేటెడ్ షిప్ బిల్డింగ్ %ఃడ% రిపేర్ కాంప్లెక్స్ ఏర్పాటు గోవా షిప్ యార్డ్స్ తీసుకున్న సముచిత నిర్ణయమని రాష్ట్ర విద్య, ఐటి, ఎల క్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. సీఐఐ సమ్మిట్ రెండవ రోజు గోవా షిప్ యార్డ్స్ ప్రాజెక్ట్స్ హెడ్ ఆదికేష్ వాసుదేవన్‌తో మంత్రి లోకేష్ భేటీ అయ్యారు.ఈ సందర్భంగా రూ.5 వేల కోట్ల పెట్టుబడితో నిర్మించబోయే షిప్ బిల్డింగ్ కాంప్లెక్స్‌పై ఆదికేష్ వివరాలు వెల్లడిం చారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా సుమారు 20,000 ఉద్యోగాలు సృష్టించబడతాయని ఆయన తెలిపారు.1057 కి.మీ.ల వ్యూహాత్మక తీరరేఖ కలిగిన ఆంధ్రప్రదేశ్ షిప్ బిల్డింగ్ రంగానికి అను వైన హబ్‌గా ఎదుగుతున్నదని మంత్రి లోకేష్ అన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఇది అత్యంత అనుకూల సమయమని వ్యా ఖ్యానించారు.భారతదేశంలోని అత్యాధునిక రక్షణ షిప్‌యార్డ్స్‌లో ఒకటైన గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్ భారత నావికాదళం మరియు తీర రక్షక దళానికి కీలక సేవలు అందిస్తున్నట్లు ఆదికేష్ తెలిపారు. అధునాతన యుద్ధ నౌకల రూపకల్పన, తయారీతో పాటు వాణిజ్య నౌకల కు లైఫ్ సైకిల్ సపోర్ట్, పునర్ నిర్మాణం, అప్‌గ్రేడ్, మరమ్మత్తుల వంటి సేవలు అందిస్తున్నట్లు చెప్పారు.

# ఇంధన భద్రత టెక్నాలజీ సమన్వయంతో ఏపీకి కొత్త దిశ

**విశాఖప దక్షిణం,పెన్ పవర్,నవంబర్ 15:** ఆంధ్రప్రదేశ్ ఇంధన రంగంలో సైబర్ భద్రతను బలోపేతం చేసి, గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిని భారీ స్థాయిలో పెంచేందుకు కీలక నిర్ణయాలు తీసు కుంది. సీఐఐ భాగస్వామ్య సదస్సులో వరల్డ్ ఎకనామిక్ ఫోరంతో కలిసి సెంటర్ ఫర్ ఎనర్జీ అండ్ సైబర్ రెజిలియన్స్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంఓయూ కుదు ర్చుకుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇంధన భద్రత, అధునాతన టెక్నాలజీ వినియో గంపై రాష్ట్రం స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను ప్రకటిం చింది.

ఇంధన భద్రత తప్పనిసరి సీఎం చంద్రబాబు

సీఎం చంద్రబాబు మాట్లాడుతూ ఇంధన రంగా నికి సైబర్ రక్షణ అత్యవసరం. గ్రీన్ ఎనర్జీ విని యోగం పెరుగుతున్న నేపథ్యంలో, భద్రతా వ్యవ స్థలు మరింత పటిష్ఠంగా ఉండాలి. ఏఐ ఆధారి త వ్యవస్థలతో విద్యుత్ పంపిణీ నష్టాలను త గ్గించడం, తక్కువ వ్యయంతో విద్యుత్ ఉత్పత్తి చేయడం మా ప్రధాన లక్ష్యం అని అన్నారు.

రాష్ట్రంలో 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు.

ఎక్కడికక్కడే విద్యుత్ ఉత్పత్తి చేసే డిస్ట్రిబ్యూ టెడ్ జనరేషన్ విధానాలు తీసుకువస్తాం. ట్రా న్స్‌మిషన్ నష్టాలను గణనీయంగా తగ్గిస్తాం" అని తెలిపారు.సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టులు వేగవంతమవుతున్నాయని, వాటి ద్వారా ప్రజ లకు ప్రత్యక్ష లాభం కలుగుతుందని వివరించారు.

డేటా సెంటర్లకు నాణ్యమైన విద్యుత్ అవసరం మంత్రి లోకేష్




మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ విశాఖలో 6 గిగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్ ఏర్పాటు కలను సీఎం సాకారం చేశారు. ఇటువంటి డేటా సెంటర్లకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్యు త్ అవసరం. అందుకే ఆధునిక టెక్నాలజీలను విద్యుత్ రంగంలో ప్రవేశపెడుతున్నాం అన్నారు.

సి ఈ సి ఆర్ సి ద్వారా విద్యుత్ సరఫరా వ్యవ స్థలకు మరింత రక్షణ లభిస్తుందని చెప్పారు. ఏపీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలంటే పరిశ్రమలందరూ ముందుకు రావాలి అని పిలుపునిచ్చారు.

గ్రీన్ ఎనర్జీలో భారీ పెట్టుబడులు: మంత్రి గొట్టిపాటి

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు ఏపీ గ్రీన్ ఎనర్జీ కేంద్రంగా మారుతోంది. 160 గిగావాట్ల ప్రాజెక్టులకు పెట్టుబడులు భారీ గా వస్తున్నాయి. ఈ సమయంలో విద్యుత్ వ్య వస్థల భద్రత అత్యంత కీలకం అని తెలిపారు.

భారత ఇంధన సంస్కరణలు వేగవంతం: డ బ్ల్యూఈఫ్ ప్రతినిధి వెఫ్ ఎండీ జేరేమీ జర్గన్స్ తెలిపారు

ఏఐ ఆధారిత మార్పుల సమయంలో ఇంధన వ్యవస్థలు అత్యంత సున్నితమైనవి. ఆంధ్రప్ర దేశ్ తీసుకుంటున్న సైబర్ భద్రత చర్యలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శం. సామాజిక ఆర్థిక స్వావ లంబనకు సి ఈ సి ఆర్ సి వంటి కేంద్రాలు తప్పనిసరి" అన్నారు.



# వ్యక్తిగత మరియు సమాజ పరిశుభ్రత పై అవగాహన కార్యక్రమం.



**పాడేరు,పెన్ పవర్,నవంబర్ 15:**ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాడేరు వ్యక్తిగత మరియుజాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ వారి ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర లో భాగంగా, ఈరోజు మూడవ శనివారం థీమ్... వ్యక్తిగత%డ% సమాజ పరిశుభ్రతపై " ముందుగా విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం అయినది. దీనిలో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనము చట్టబ్బాయి మాట్లాడుతూ... యువతీ యువకులు వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టి సారించాలని, ఆరోగ్యవంతమైన జీవనాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. %×ూాజ% కోఆర్డినేటర్ పి కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలని, వేడి నీటిని తాగాలని, మీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ ఆఫీసర్ జి గౌరీ శంకర్రావు మాట్లాడుతూ.. వ్యక్తిగత %డ% సమాజ పరిశుభ్రతపై అనే అంశంపై విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, మరియు నీటిని ఎలా పొదుపు చేయాలి? నీటిని కాలుష్యం కాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వాటిపై అవగాహన కల్పించి, విద్యార్థిని విద్యార్థులు చే స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు జిల్లా అధికారులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ పి జానకిరామ్ డాక్టర్ డి సునీత, కళాశాల సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆదివాసి హక్కుల ఉద్యమ నేత బిర్షముండా, ఘన నివాళులు అర్పించిన టిడిపి డివిజన్ నాయకులు దారేలా సర్పంచ్, పాండురంగస్వామి.



**పాడేరు,పెన్ పవర్,నవంబర్ 15:**బిర్సం ఉండ జయంతి పురస్కరించుకొని అల్లూరి జిల్లా ముంచంగి మండలం దారెల పంచాయితీ హెడ్ క్వార్టర్స్ లో బిరసముండా చిత్రపటానికి స్థానిక సర్పంచ్ టీడీపీ డివిజన్ నాయకులు పాంగి పాండురంగ స్వామి పూలమాలలతో నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసి హక్కుల ఉద్యమ నేత బిరసముండా అని ఆదివాసి హక్కుల కోసమే కాకుండా స్వాతంత్ర ఉద్యమంలో భారతదేశ స్వాతంత్రం కోసం ఆదివాసుల పక్షం నిలబడిన నాయకుల్లో బిర్సముండా ఒకరని వారి త్యాగాలు మరువలేమని బిస్సా ముండా ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని వారి త్యాగం వృధా కానివ్వకుండా ఉద్యమకారులకు ఆయన ఎంతో స్ఫూర్తిదాయకమని కూటమి ప్రభుత్వంలో అధికారికంగా బిరసముండా జయంతి వేడుకలు జరపడం ఎంతో సంతోషకరమని ఆయన త్యాగం ఆదివాసులకే కాకుండా బడుగు బలహీన వర్గాల కోసం పోరాటం చేసిన వ్యక్తి బిరసముండా అని ఈ సర్పంచ్ టిడిపి డివిజన్ నాయకులు పాంగి పాండురంగ స్వామి అన్నారు ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ భాస్కర్ టిడిపి గ్రామపంచాయతీ అధ్యక్షులు శెట్టి గోపాలం సచివాలయ సిబ్బంది గ్రామ పెద్దలు వైస్ సర్పంచ్ మధు తదితరులు పాల్గొన్నారు.

# కళాశాల విద్యార్థులకు తోలుబొమ్మలు ఆట శిక్షణ

* ప్రిన్సిపల్ డాక్టర్ విజయభారతి





**చింతపల్లి పెన్ పవర్ నవంబర్ 15 :-**చింతపల్లిడిగ్రీ కళాశాలలో తోలుబొమ్మల ఆట శిక్షణ తయారీలో సర్టిఫికెట్ కోర్సులు ,నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం విజయభారతి తెలిపారు అనంతపురం జిల్లా ధర్మవరానికి చెందిన ప్రముఖ తోలుబొమ్మల ఆట నిర్వాహకులు కె రామాంజనేయులు శ్రీ మారుతి తోలుబొమ్మల బృందం ఈ శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేయబడినది, అనేక కళలకు మూలమైన తోలుబొమ్మ ఆట కల ను ప్రస్తుత సమాజానికి తెలియజేయాలి అనే ఉద్దేశంతో ఈ కార్యక్రమంలో తెలిపారు, ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం ఐ రవీంద్ర నాయక్, జగత్ రాయి, ఈశ్వర రావు, పూర్ణరావు, శ్రీనివాసరాజు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# విశాఖపట్నం A1 గ్రాండ్ కన్వెన్షన్‌లో బిర్సా ముండా 150వ జయంతి ఉత్సవాలకు విశిష్ట అతిథులుగా హాజరైన కేంద్ర మంత్రి రామ్ మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి సంధ్యారాణి, గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్






**పాడేరు,పెన్ పవర్,నవంబర్ 15:**విశాఖపట్నం %ూా%1 గ్రాండ్ కన్వెన్షన్‌లో ఆదివాసీ ఐక్యత, హక్కుల పరిరక్షణ, గిరిజన గౌరవం ప్రతిఫలించేలా బిర్సా ముండా 150వ జయంతి ఉత్సవాలు శోభాయమానంగా నిర్వహించబడ్డాయి. గిరిజన ఉద్యమ చరిత్రలో చిరస్మరణీయమైన బిర్సా ముండా సేవలకు దేశవ్యాప్తంగా ఘన నివాళులు అర్పిస్తున్న సందర్భంలో విశాఖలో జరిగిన ఈ వేడుకలకు విపరీతమైన ప్రజాశ్రద్ధ లభించింది.

కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర విమానయాన శాఖ మంత్రి శ్రీ రామ్ మోహన్ నాయుడు, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రివర్యులు శ్రీమతి గుమ్మడి సంధ్యారాణి, రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ శ్రీ కిడారి శ్రావణ్ కుమార్ హాజరై జయంతి ఉత్సవాలకు మరింత గౌరవం తీసుకువచ్చారు.

వేదికపై నేతలు బిర్సా ముండా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆయన త్యాగం, సేవ, పరాక్రమాన్ని స్మరించారు.

బిర్సా ముండా స్వాతంత్ర్య పోరాటాన్ని మాత్రమే కాదు, గిరిజనుల ఆత్మగౌరవాన్ని రక్షించడానికి నడిచిన మహోన్నత దారిని దేశం ఎప్పటికీ మరిచిపోదని వారు పేర్కొన్నారు.

**మంత్రి రామ్ మోహన్ నాయుడు ప్రసంగం:**

కేంద్ర మంత్రి రామ్ మోహన్ నాయుడు మాట్లాడుతూ,

"గిరిజన సమాజ అభివృద్ధి కేంద్ర ప్రభుత్వ ప్రాధాన్య లక్ష్యం. బిర్సా ముండా చూపిన ధైర్యం, నాయకత్వం నేటి తరానికి మార్గదర్శకం. గిరిజన ప్రాంతాల మౌలిక సదుపాయాల విస్తరణ, విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాల్లో కేంద్రం పెద్దఎత్తున పెట్టుబడులు పెడుతోంది," అని తెలిపారు.

**మంత్రి సంధ్యారాణి సందేశం:**

రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ,

"గిరిజనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూపొందిస్తున్న ప్రత్యేక కార్యాచరణ పథకాలు అన్ని జిల్లాల్లో ప్రభావవంతంగా అమలు అవుతున్నాయి. బిర్సా ముండా జయంతిని 'గిరిజన జాతీయ గౌరవ దివస్'గా అలంకరించడం గిరిజన సమాజ పట్ల ప్రభుత్వం చూపుతున్న గౌరవానికి నిదర్శనం," అన్నారు.

**చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ వ్యాఖ్యలు:**

గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ,

"గిరిజనుల ఆర్థిక శక్తివంతీకరణ మా ప్రధాన లక్ష్యం. అడవి వనరుల ప్రాసెసింగ్, మార్కెటింగ్, కో-ఆపరేటివ్ వ్యవస్థ బలోపేతం, గిరిజన యువత నైపుణ్యాభివృద్ధి వంటి పథకాలను వేగంగా అమలు చేస్తున్నాం," అని వివరించారు.

కార్యక్రమంలో గిరిజన కళారూపాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, యువత ప్రతిభ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సదా భార్గవి, అధికారులు గిరిజన నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు భారీగా పాల్గొని వేడుకను విజయవంతం చేశారు.

# వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్పన్న ఏకాదశి సందర్భంగా స్వామికి మహాభిషేకం





**గాజువాక: పెన్ పవర్ ,నవంబర్ 15** జీవీఎంసీ 65 వ వార్డు వాంబే కాలనీ గరుడాద్రి కొండపై వెలసిన శ్రీ భూ సమేత వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈరోజు ఉత్పన్న ఏకాదశి సందర్భంగా ఆలయ ధర్మకర్త మంత్ర మంజుల ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ దొడ్డి రమణ నేతృత్వంలో స్వామివారికి మహాభిషేకం భక్తుల సందోహంలో అత్యంత వైభవముగా నిర్వహించడం జరిగినది. అనంతరం ప్రతి శనివారం నిర్వహించే అన్న ప్రసాద కార్యక్రమం గంగిరెడ్డి రామకృష్ణారెడ్డి జ్ఞాపకార్థం వారి సతీమణిప్రమీల రాణి వారి ఆర్థిక సహాయంతో అన్న ప్రసాద వితరణ జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మిట్టని అప్పల రెడ్డి హాజరయ్యారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఈరోజు ఉత్పన్న ఏకాదశి విష్ణుమూర్తికి ఎంతో ఇష్టమైన రోజు ఏకాదశి ఈ రోజున విష్ణుమూర్తి గాఢ నిద్రలో ఉండగా రాక్షసుడు స్వామివారిని సంహరిచడానికి రాగా విష్ణుమూర్తి శరీరం నుంచి ఒక దేవత బయటకు వచ్చి రాక్షసింది అంతమందిస్తుంది కనుకనే ఏకాదశి అని పిలుస్తారు. ఉత్తర ద్వారంలో వెలసిన వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయం ఇది ఒకటి . స్వామివారిని దర్శించుకుని కోరిన కోరికలు తీర్చుమన్న అభ్యర్థిస్తే వెంటనే తీరుస్తారని భక్తుల ప్రగాఢ నమ్మకం. ఈ కార్యక్రమంలో ఆలయ సేవకులు అయ్యప్ప భవాని శివమాల ధారణ చేసిన భక్తులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# చిడిగొంది గ్రామంలో భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి వేడుకలు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్ 15:**భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా గూడెం కొత్త వీధి మండలం దేవరపల్లి పంచాయతీ పరిధిలోని చిడిగొంది గ్రామంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు పెద్దఎత్తున పాల్గొని బిర్సా ముండా సేవలను స్మరించుకున్నారు. గ్రామ సర్పంచ్ సిరబాల బుజ్జిబాబు, గ్రామ సచివాలయ సెక్రటరీ స్వామినాయుడు,వార్డు మెంబర్ బిజెపి మండల అధ్యక్షుడు శేఖర్, వైస్ సర్పంచ్ గుమ్మడి రాజుబాబు, అలాగే పిసా కమిటీ సభ్యులు హాజరై నివాళులర్పించారు. యువతతో పాటు గ్రామస్తులు ఎంతో ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 87వ వార్డ్ లో పారిశుద్ధ కార్మికులకు బట్టలు పంపిణీ కార్యక్రమం...







**కూర్మన్నపాలెం :పెన్ పవర్ ,నవంబర్ 15** మహా విశాఖ నగర పాలక సంస్థ 87వ వార్డ్ పరిధిలో పారిశుద్ధ కార్మికులకు బట్టల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి స్థానిక వార్డు కార్పొరేటర్ బోండా జగన్నాథం పాలుగొన్నరు . ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ పారిశుద్ధ కార్మికులు ప్రజలకు చేస్తున్న సేవలు వర్ణించలేనివని, కరోనా మరియు విజయవాడకి వచ్చిన వరద విపత్తుల్లో వీరు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం వీరి శ్రమను గుర్తించి వీరికి బట్టలు పంపిణీ చేయడం ఓ మంచి శుభ సూచకమని అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు విజయరామరాజు, సానిటరీ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్,సెక్రటరీ బొట్టా ప్రకాష్, రాజన్ రాజు,జెనసేన నాయకులు కర్రి నరసింగ రావు,రాజు, సుందర్ సునీల్, ఆదినారాయణ, పరమానందం, నారాయణరావు, తాతారావు,శివయ్యా,సచివాలయం సిబ్బంది జగన్నాధం, సంధ్య, సానిటరీ సిబ్బంది శ్రీను, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# విజ్ఞాన్ మహిళా కళాశాల లో SC,ST ఎస్ సి ,ఎస్ టి విద్యారులకు ఈక్వల్ ఆపర్చునిటీ సెల్ పై అవగాహన




**కూర్మన్న పాలెం :పెన్ పవర్ ,నవంబర్ 15** యూజీసి12 వ ప్రణాళిక చూచనల మేరకు, ఏఐసిటిఈ, నిబంధనల ప్రకారం , అన్ని విశ్వ విద్యాలయాలు, కళాశాల ల్లో ఎస్సీ, ఎస్టీ విద్యారుల కోసం ఏర్పాటు చేయవలసిన ఈక్వల్ ఆపర్చునిటీ సెల్ఏ ర్పాటు, దాని ఆవశ్యకత ను, విద్యార్థుల లు అందించే సదుపాయాలు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం అందించే స్కాలర్షిప్ లు వివరణ, విజ్ఞాన్ మహిళా కళాశాల యాజమాన్యం చూపే ప్రత్యేక శ్రద్ధ, మౌలిక వసతులు పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డా. బి.అరుంధతి గారు మాట్లాడారు. అలాగే ప్లేస్మెంట్ సెల్ డీన్ డా. డి మనీంద్ర సాయి ఈ కార్యక్రమం లో ఎస్సీ, ఎస్సీ విద్యార్థులకు ప్రభుత్వం ఉచితం గా అందించే "ఆర్టిఫికల్ ఇంటిలిజెన్స్ డేటా అసోసియేట్" కోర్సు కోసం పూర్తి వివరణ ఇచ్చారు. ప్రతీ ఒక్కరు ఆ కోర్సు చేస్తే వేగంగా పెరుగుతున్న టెక్నాలజీ కి ఆ కోర్సు ఎంత గానో ఉపయోగ పడుతుంది అని వివరించారు. ఈక్వల్ ఆపర్చునిటీ సెల్ యెక్క ప్రాముఖ్యతను అవశ్యకత, దాని ద్వారా విద్యార్థులు ఎలాంటి లబ్ది చేకూరుతుంది అనేది వివరించడం తో పాటు విద్యార్థుల సందేహాలకు సమాధానాలు ఈక్వల్ ఆపర్చునిటీ సెల్ కో ఆర్డినేటర్ డా.చంద్ర శేఖర్ బీర తెలిపారు. ఈ కార్యక్రమం లో సెల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కేజీహెచ్ అవగాహన చర్యలు





**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 15 :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి ఆధ్వర్యంలో కొనసాగుతున్న స్వర్ణ ఆంధ్ర%-%స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కింగ్ జార్జ్ ఆసుపత్రిలో శనివారం ప్రత్యేక అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఈ నెల థీమ్ అయిన "వ్యక్తిగత మరియు సమూహ పరిశుభ్రత" పై సిబ్బందికి ప్రత్యేక అవగాహన కల్పించారు.

డాక్టర్ వాణి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను కచ్చితంగా పాటించాల ని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మూత్ర విసర్జన, మల విసర్జన చేయకూడదని, మరుగు దొడ్లను శుభ్రంగా ఉపయోగించాలని, చేతి గోర్లు పెంచకుండా క్రమం తప్పకుండా కత్తిరించుకో వాలని తెలిపారు. దగ్గు%-%జలుబు ఉన్నపుడు ఇతరులకు సంక్రమించకుండా చేతి రుమాలు లేదా చేతి మోచేతిని అడ్డుపెట్టుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. పరిశుభ్రమైన నీరు తాగడం, పరిసరాల పరిశుభ్రత పాటించడంతో అనారోగ్య సమస్యలను తగ్గించుకోవచ్చని అన్నారు. స్టాఫ్ నర్స్ గ్లోరీ చేతుల శుభ్రత పద్ధతులను ప్రత్యక్షంగా ప్రదర్శించగా, అనంతరం ఆసుపత్రి పరిధిలో ర్యాలీ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి తో పాటు డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ వాసవి లత, డాక్టర్ చంద్రశేఖర్ నాయు డు, స్వర్ణ ఆంధ్ర%-%స్వచ్ఛ ఆంధ్ర నోడల్ అధికారి డా. ఏ. రాజేష్, ఆర్ఎమ్ఓ బంగారయ్య, నర్సింగ్ సూపరింటెండెంట్ సి. హెచ్. పద్మావతి, మినిస్టీరియల్ సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

# అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించిన జనసేన నాయకులు





**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్ 15:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం జర్రెల గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో బుధవారం రాత్రి కలుషితమైన ఆహారం కారణంగా సుమారు 50 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి గురించి సమాచారం తెలిసిన వెంటనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జానపద కళలు మరియు సృజనాత్మకత అకాడమీ చైర్మన్, పాడేరు జనసేన పార్టీ ఇంచార్జ్ డాక్టర్ వంపూరు గంగులయ్య ఆదేశాల మేరకు జనసేన పార్టీ అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీర వెంకట్, ఆధ్వర్యంలో జన సేన నాయకులు పాఠశాలకు వెళ్లి విద్యార్థులను పరామర్శించారు. జనసేన నాయకులు పాఠశాలలోని వాస్తవ పరిస్థితులను పరిశీలించి, సంఘటనకు గల కారణాలను పాఠశాల యాజమాన్యం, వార్డెన్ నుంచి అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా మాట్లాడుతూ, ఆ రాత్రి భోజనానికి "నాగలి దుంపల కూర" మరియు "పెరుగు" విద్యార్థులకు పెట్టడం జరిగిందని కేవలం కూర మాత్రమే తిన్న విద్యార్థులకు ఎటువంటి సమస్యలు రాకపోయినా, కూరతో పాటు పెరుగు తీసుకున్న విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని వెల్లడించారు. కిచెన్ పరిస్థితిని కూడా పరిశీలించిన నాయకులు, ఆహారం వేడిగా ఉన్నప్పుడే వడ్డించాలని వంట సిబ్బందికి సూచించారు. అనంతరం అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించి వారికి బ్రెడ్, పండ్లు అందజేశారు. వైద్యులతో మాట్లాడి విద్యార్థుల ఆరోగ్యంపై వివరాలు తెలుసుకున్న నాయకులు, ప్రస్తుతం అందరి పరిస్థితి స్థిరంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు కొయ్యం బాలరాజు, అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీర వెంకట్, జనసేన పార్టీ నాయకులు కొయ్యం ఇమ్మానుయేల్ (సిద్దు), సుర్ల వీరేంద్ర,గుంట కోటి, చిక్కుడు అశోక్,వనపల ఈశ్వర్,వీరేంద్ర,తదితరులు పాల్గొన్నారు.

# దామనపల్లి పంచాయతీలో స్వచ్ఛ్ ఆంధ్ర-స్వచ్ దివాస్, ఘనంగా బిర్సా ముండా 150వ జయంతి వేడుకలు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్ 15:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం దామనపల్లి పంచాయతీలో శనివారం స్వచ్ఛ్ ఆంధ్ర-స్వచ్ దివాస్ కార్యక్రమాన్ని భారీగా నిర్వహించారు. అనంతరం సచివాలయంలో సర్పంచ్ కె. రామకృష్ణ ఆధ్వర్యంలో జన జాతీయ గౌరవ్ దివాస్ సందర్భంగా భగవాన్ బిర్సా ముండా 150వ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కె. రామకృష్ణ మాట్లాడుతూ, వలసవాద బ్రిటీష్ పాలనపై ధైర్యంగా తిరుగుబాటు చేసిన గొప్ప స్వతంత్ర సమరయోధుడు బిర్సా ముండా గిరిజన జాతికి అమర యోధుడని పేర్కొన్నారు. జార?ండ్ రాష్ట్రం ఖుంతీ జిల్లాలోని ఉలిహాతు గ్రామంలో 1875 నవంబర్ 15న జన్మించిన బిర్సా ముండా, సర్దారి ఉద్యమం (1858-1894) ద్వారా బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా గిరిజనుల హక్కుల కోసం పోరాడిన సంగతి సర్పంచ్ వివరించారు. 1894 అక్టోబర్ 1న తన స్వగిరిజనులను సమీకరించి పన్ను మాఫీ కోసం బిర్సా ముండా ప్రారంభించిన ఉద్యమం బ్రిటీష్ ప్రభుత్వాన్ని కుదిపేసిందని చెప్పారు. 1895లో ఆయన అరెస్ట్ అయి హజారీబాగ్ జైలులో రెండు సంవత్సరాలు శిక్ష అనుభవించారు. విడుదల తర్వాత మళ్లీ బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం కొనసాగించిన బిర్సాను 1900 ఫిబ్రవరి 3న మరోసారి అరెస్ట్ చేశారని, అనంతరం బ్రిటిష్ వారు చేసిన విషప్రయోగం వల్ల 1900 జూన్ 9న జైలులో ఆయన మరణించారని సర్పంచ్ తెలిపారు. మొత్తం 22 ఏళ్ల స్వల్ప వయస్సులోనే గిరిజన జాతి వీరత్వం, సాహసస్వభావం, గౌరవం ప్రపంచానికి తెలియజేసిన యోధుడు బిర్సా ముండేనని, గిరిజనులు ఆయన ఆశయాలను కొనసాగించేందుకు 1/70 చట్టం, పీసా చట్టం,జిఓ నం. 3 వంటి గిరిజనులకు ఉన్న హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమాలు కొనసాగించాలని సర్పంచ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ వెంకట శివలక్ష్మి, డిజిటల్ అసిస్టెంట్ సింహాచలం, మహిళా పోలీస్ రవణమ్మ, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్వాడి సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సన్‌రైజ్ ఆంధ్రా- వైబ్రెంట్ ఆంధ్రా వైపు

రాష్ట్రం మరింత శక్తివంతంగా ముందడుగు వేస్తోంది,
గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో రికార్డు స్థాయి పెట్టుబడులు ఏపీపై విశ్వగౌరవం



**విశాఖ దక్షిణం పెన్ పవర్, నవంబర్ 15 :** విశాఖలో జరుగుతున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మి ట్ అద్భుత విజయాన్ని నమోదు చేసిందని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు మరియు గృహ నిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థ సారధి తెలిపారు. సిఐఐ భాగస్వామ్య సదస్సు ల రెండో రోజు ఆయన మీడియా కేంద్రంలో జర్నలిస్టులతో మాట్లాడారు.

మంత్రి మాటల్లో ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకి అత్యంత సురక్షితమైన, నమ్మకమైన గమ్యం అని గ్లోబల్ ఇన్వెస్టర్లు భావిస్తున్నారు. దానికి నిదర్శనంగా గత రెండు రోజుల్లో ఒక్కటే దాదా పు 11 లక్షల కోట్ల రూపాయల విలువైన ఎంఓయూలు వివిధ రంగాల్లో కుదిరాయి, అని అన్నారు. శనివారం కూడా భారీ పెట్టుబడులు ప్రకటించేందుకు అనేక మంది పెట్టుబడిదారులు సమ్మిట్‌కు హాజరవుతున్నారని వెల్లడించారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయు డు విజన్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంపై పెట్టుబడిదారులకు పూర్తి నమ్మకం ఏర్పడిందని, అందువల్లే ఇంత భారీ స్థాయిలో పెట్టుబడులు ముందుకు వస్తున్నాయని మంత్రి చెప్పారు.

ప్రభుత్వం మౌలిక వసతుల సమకూర్పుకు సిద్ధంగా ఉందని, అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూముల వివరాలు పెట్టుబడిదారులకు అందించామని వివరించారు. ఇప్పటికే 8,33,000 కోట్ల రూపాయల పెట్టుబడులు ఖరారయ్యాయి. ఈ పెట్టుబడులు లక్షలాది మందికి ఉపాధి అవకాశాలను కల్పించబోతున్నాయని తెలిపారు.

వైజాగ్ సహా మొత్తం ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడిదారులు అత్యంత సురక్షిత, అనుకూల పెట్టుబడి గమ్యస్థానంగా చూస్తున్నారని మంత్రి అభిప్రాయపడ్డారు. శనివారం రానున్న భారీ పెట్టుబడి ఒప్పందాలతో రాష్ట్రం మరింత వెలుగొందుతుం దని అన్నారు.

# కాలుష్యాన్ని నివారిద్దాం మొక్కలను నాటుదాం.

కురుపాం నియోజకవర్గం ఎమ్మెల్యే%ఽ% ప్రభుత్వ విప్. తోయక జగదీశ్వరి.





స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్. గుమ్మలక్ష్మీపురం మండల కార్యాలయం లో శనివారం నాడు స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం లో భాగంగా మండల కార్యాలయంవద్ద మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మనం వుండే పరిసర ప్రాంతాలను పరిశుభ్రమగా ఉండాలని,అలాగే కాలుష్యంను నివారించలటే ప్లాస్టిక్ వాడటం మానేయాలి. మన చుట్టు ఉన్న పరిసర ప్రాంతాలలో మొక్కలు నాటలని అన్నారు. అనంతరం

మండల స్థాయి వనరుల కేంద్రాన్ని నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్ పర్సన్ కద్రక కళావతి,టిడిపి మండల పార్టీ అధ్యక్షులు అడ్డాకుల నరేష్,నియోజకవర్గ మహిళా కార్యదర్శి వెంపటాపు భారతి,నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు మండంగి భూషణరావు,దుమ్మంగి సర్పంచ్ పాలక క్రాంతి కుమార్,మండల విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్,ఎమ్మార్వో శేఖరం,నాయకులు ప్రసాద్ దామోదర రావు,రామారావు,సుబ్బలక్ష్మి,రాజు,శరత్, బాలు, అప్పలస్వామి ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది,

# ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్‌కు మర్యాదపూర్వకంగా కలిసిన జీకే వీధి విలేకరులు



## గ్రామీణ విలేకరుల కోసం పునఃశ్చరణ తరగతులు ప్రారంభం

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్ 15:** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లిలో గ్రామీణ ప్రాంత విలేకరుల కోసం పునఃశ్చరణ (రీఫ్రెషర్) తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. సి ఆర్ మీడియా (ప్రెస్ అకాడమీ) ఆధ్వర్యంలో, ఏపీయూడబ్ల్యూజే చింతపల్లి ప్రెస్ క్లబ్ సారథ్యంలో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న ఈ శిక్షణా తరగతులకు ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గూడెం కొత్త వీధి మండలానికి చెందిన పత్రికా విలేకరులు చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పలకరించారు. జర్నలిస్టుల నైపుణ్యాలు, ఫీల్డ్ రిపోర్టింగ్‌లో నాణ్యత, నైతిక విలువలు, నూతన మీడియా పరిజ్ఞానం వంటి అంశాలపై ఈ తరగతుల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వబడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఐజెయు సెక్రటరీ జనరల్, సీనియర్ పాత్రికేయులు సోమ సుందర్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి సి. హెచ్. బి. ఎల్. స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసిన వారిలో ఈనాడు విలేకరి సురకత్తి లక్ష్మణ్ బాబు, పెన్ పవర్ విలేఖరి మాదిరి చంటిబాబు, ఆంధ్రప్రభ విలేఖరి సాగిన లక్ష్మణరావు, విశాలాంధ్ర విలేఖరి గబులంగి హనుమంతరావు, ప్రజాశక్తి విలేఖరి చిన్నరావు, సమీరెడ్డి విజయ్ తదితరులు ఉన్నారు. జిల్లా గ్రామీణ జర్నలిస్టులు ఈ తరగతులు తమ వృత్తిపర నైపుణ్యాల అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తాయని పేర్కొన్నారు.

# దారకొండలో బిర్సా ముండా జయంతి సందర్భంగా బైక్ ర్యాలీ!





**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్ 15:** జీకే వీధి మండలం దారకొండలో శనివారం భగవాన్ బిర్సా ముండా జయంతిని ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ రాజకీయ పార్టీలకు చెందిన గిరిజన నాయకులు హాజరై బిర్సా ముండా సేవలను స్మరించుకున్నారు. స్వాతంత్ర్య పోరాటంలో బిర్సా ముండా ప్రదర్శించిన పరాక్రమం, దేశం కోసం చేసిన త్యాగం, గిరిజనుల హక్కుల కోసం నడిపిన పోరాటం గురించి పలువురు నాయకులు మాట్లాడుతూ ఆయనను స్మరించారు. అనంతరం వినాయకుడి దేవాలయం నుండి హనుమాన్ జంక్షన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. బైక్ ర్యాలీ సందర్భంగా యువత భారీగా పాల్గొని జయంతి వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుంకరి విష్ణుమూర్తి, కాంగ్రెస్ నాయకులు పోతురాజు మల్లుదొర, కొర్రా రాంబాబు, బీజేపీ నాయకుడు తగ్గి వీరభద్రం, సీపీఐ మండల అధ్యక్షుడు పాంగి నాగేశ్వరరావు, చీర్ల రామకృష్ణ, గడుతూరి గిరి, శెట్టి వెంకటేష్, శెట్టి రాజు, గొర్లె బరసయ్య, రీమలి తిరుమలేష్, దుమంతి దారఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ వేడుకలు బిర్సా ముండా అమర సేవలను స్మరించుకుంటూ విజయవంతంగా పూర్తయ్యాయి.

# విమ్స్ లో స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర

* వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం:విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కే రాంబాబు



**విశాఖ తూర్పు, పెన్ పవర్,నవంబరు 15**:వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని విశాఖ ఇనిస్ట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ కే రాంబాబు అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి నెల 3 వ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర స్వచ్ఛంద కార్యక్రమాన్ని విమ్స్ లో నిర్వహించారు.కార్యక్రమాన్ని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కే రాంబాబు ప్రారంభించారు..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల థీమ్ వ్యక్తిగత సామాజిక పరిశుభ్రత అనే కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి ఆవరణంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామని, అనారోగ్యానికి గల కారణాల్లో వ్యక్తిగత అశుభ్రత ఒకటి అని కోవిడ్ టైం లో కూడా వ్యక్తిగత శుభ్రత అనేది ఎంత అవసరమో అనేది మన అందరికీ తెలియవచ్చిందని, మన వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తూ సామాజిక పరిశుభ్రతకు కృషి చేయాలి అన్నారు.నిరంతరం చేతులు, కాళ్లు శుభ్రం చేసుకోవడం వంటివి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు..

# దుప్పితూరులో భూ అక్రమణ

* పవన్ కళ్యాణ్ కు ఫిర్యాదు




**విశాఖ పెన్ పవర్ నవంబర్ 15:**అనకాపల్లి జిల్లా, అత్యుతాపురం మండలం, దుప్పితూరు గ్రామం సర్వే నెం. 40-2 లో కోట్ల విలువైన భూములను కూండ్రపు సత్య,పైలా వెంకట స్వామి అలియాస్ బాబు వగైరాలు ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని,భూ యజమానలు, బాధితులు

విజయనగరం కు చెందిన భీమరశెట్టి రమణ బాబు, భీమరశెట్టి లక్ష్మి నారీమణి ఆరోపించారు. విజెఎఫ్ ప్రెస్ క్లబ్ లో వారు మీడియాతో మాట్లాడుతూ, మొత్తం 11 ఎకరాల,23.5 సెంట్లు భూమిని, తాము కొనుగోలు చేశామని,ఈ భూమి 2004 మే 28న ఎలమంచిలి సబ్ రిజిస్టార్ కార్యాలయంలో తమ ఇద్దరితోపాటు పెంటకోట రామ జోగినాయుడు అను వ్యక్తితో కలిపి మొత్తం ముగ్గరికి రిజిస్టర్ కాబడి, నాటి నుంచి నేటి వరకు తమ సంపూర్ణ హక్కు భుక్తంలో ఉందని తెలిపారు. ఈ భూమిపై వివాదం తల ఎత్తిన సందర్భంలో తాము హైకోర్టు, ఆ తర్వాత సుప్రీం కోర్టు లను ఆశ్రయించగా, తమకు అనుకూలంగా తీర్పు రావడం, భూమి తమ ఆధీనంలో ఉండడం, తామే హక్కు దారులుగా కొనసాగుతూ ఉండడం జరుగుతుందన్నారు. అయితే కూండ్రపు సత్య, పైలా వెంకట స్వామి అలియాస్ బాబు వగైరాలు భూ-దురాక్రమణ చేయుటకు ప్రయత్నించగా తాము అచ్యుతాపురం పోలీసులకు, తహసీల్దార్ నెల రోజుల క్రితం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.తహసీల్దార్ 145 నోటీసులు జారీ చేయటం జరిగిందన్నారు. అయితే భూ-ఆక్రమణదారులైన కూండ్రపు సత్య, పైలా వెంకటస్వామి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు తప్పుడు సమాచారం ఇచ్చి, తప్పుడు ఫిర్యాదు చేసి తప్పుదోవ పట్టించారన్నారు. అయితే ఈ విషయంలో తమ వైపు , ప్రజల వైపు, న్యాయబద్ధం గా వ్యవహరిచే యలమంచలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ పై బురద చిమ్మి, లేనిపోని ఆరోపనులు చేసి మీడియా ద్వారా తప్పుడు వార్తలు రాయిస్తూ వ్యవస్తను తప్పు తోవ పట్టిస్తున్నారన్నారు.

ప్రతినిదులు చేస్తున్న తప్పుడు ప్రకటనలను తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు.

# పెదవలస జి టి డబ్ల్యూహెచ్ పాఠశాలను పరిశీలించిన సర్పంచ్ కృష్ణవంశీ





**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్ 15**:అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం పెదవలస పంచాయతీ పరిధిలోని గవర్నమెంట్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో జనసేన పార్టీ సర్పంచ్ పి. కృష్ణవంశీ పర్యవేక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పాఠశాల విద్యార్థులతో కొంతసేపు సమావేశమై వారితో మాట్లాడారు.సర్పంచ్ కృష్ణవంశీ విద్యార్థుల భోజన పథకం సక్రమంగా అమలు కావడంపై దృష్టి పెట్టారు. మెనూ ప్రకారం భోజనాలు సమయానికి అందించబడేలా, ముఖ్యంగా పప్పులు, పెరుగు ప్యాకెట్లు వంటి అవసరమైన వస్తువులు తప్పకుండా పిల్లలకు ఇవ్వాలని, కాల పరిమితి చెల్లిన వాటిని విద్యార్థులకు ఇవ్వవద్దు అని వార్డెన్‌కి సూచించారు.అతని సూచనల ప్రకారం భోజన పథకం సక్రమంగా అమలులో ఉండాలని మరియు మార్చి నెలలో జరిగే పదవ తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పి. కృష్ణవంశీతో పాటు పిసా ఉపాధ్యక్షులు దొరబాబు, కూటమి నాయకులు గిరిబాబు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

# గుమ్మ కోట పంచాయతీ గ్రామాలలో ప్రజా ఉద్యమ దిశగా కోటి సంతకాల కార్యక్రమం లో ఎమ్మెల్యే రేగం.





**అనంతగిరి, నవంబర్ 15. పెన్ పవర్** రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యంలో కోటి సంతకాల 'ప్రజా ఉద్యమం' శనివారం గుమ్మ కోట పంచాయతీ చిప్పపల్లి గ్రామంలో అనంతగిరి మండల అధ్యక్షుడు కొర్ర సూర్యనారాయణ సమక్షంలో అరుకు శాసనసభ్యులు రేగం మత్స్యలింగం ముఖ్యఅతిథిగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్స్యలింగం మాట్లాడుతూ పేద విద్యార్థులకు వైద్యవిద్య, ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుఆటులోకి తేవాలనే సంకల్పంతో వైసిపి ప్రభుత్వ హయాంలో 17 వైద్య కళాశాలలను మంజూరు చేస్తే, ఇపుడు వాటిని పిపిపి విధానంలో ప్రయివేటుకు కట్టబెట్టే కుట్రలను కూటమి ప్రభుత్వం చేయడం దుర్మార్గమన్నారు. దీనిపై గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు 45 రోజులపాటు కోటి సంతకాల సేకరణ చేపడుతున్నామన్నారు. అనంతరం వైసిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో గవర్నర్కు నివేదిక పంపిస్తామన్నారు. అనంతరం భీమవరం పీహెచ్సీ సందర్శించి రోగులను పరామర్శించారు. వైద్యులు అనుదీప్, నాయుడు తో కలిసి ఆసుపత్రి విభాగాలను పరిశీలించారు పరిశీలించారు.

**రూ.3 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

గుమ్మ కోట పంచాయతీ భీమవరం గ్రామం ఎస్సీ కాలనీలో మండల పరిషత్ నిధులు మూడు లక్షల రూపాయలతో 50 మీటర్లు మరుగు కాలువ నిర్మాణానికి ఎమ్మెల్యే మత్స్యలింగం,అనంతగిరి మండల ఎంపీపీ నీలవేణి తో కలిసి శంకుస్థాపన చేశారు.

**ఆదివాసీల ఆరాధ్య దైవం భిర్సాముండ ఎమ్మెల్యే రేగం**

ఆదివాసీల ఆరాధ్యదైవం భగవాన్ బిర్సా ముండా అని, గిరిజనుల సంక్షేమం కోసం దేశ స్వాతంత్రం కోసం పోరాటం చేసిన మహా వ్యక్తి అని అరుకు శాసనసభ్యులు వేగంఅరుకు శాసనసభ్యులు రేగం మత్స్యలింగం తెలిపారు. అనంతగిరి మండలంలోని గుమ్మకోట గ్రామ గ్రామ సచివాలయంలో శనివారం జన్ జాతీయ గౌరవ్ దివస్ దినోత్సవం, బిర్సా ముండా 150వ జయంతి వేడుకలలో ఎమ్మెల్యే మచిలింగం, అనంతగిరి మండలం ఎంపీపీ నీలవేణి పాల్గొన్నారు. ఆదివాసీల ఆరాధ్యదైవం భగవాన్ బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం గుమ్మకోట గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులను పుస్తకాలు చదివిస్తూ సామర్థ్యాలపై ప్రిన్సిపల్ శ్రీనివాసరావుతో మాట్లాడారు. అనంతరం స్టాక్ రూమ్ రికార్డుల నిర్వహణపై తనిఖీ చేసి సంతృప్తి వ్యక్త పరిచి పాఠశాల ప్రాంగణంలో ఎంపీపీ తో కలిసి మొక్క నాటారు.ఈ కార్యక్రమంలో శెట్టి నీలవేణి ఎంపీపీ అనంతగిరి,పాడి కృష్ణమూర్తి మండల ఉపాధ్యక్షులు,పాంగి అప్పారావు పోరం అధ్యక్షులు,ఎం కృష్ణ మండల వార్డ్ మెంబర్,దూరు గంగన్న దొర మాజీ జెడ్పిటిసి సభ్యులు,సెంబి సన్యాసిరావు సర్పంచ్ వాలాసి,కొర్ర లక్ష్మణరావు,యస్ అశోక్ ఎంపీటీసీ గుమ్మకోట,టి రాంబాబు,పట్నాయక్ చందు,జన్ని చిన్నయ్య మాజీ సర్పంచ్ భింపోల,మామిడి అప్పలకొండ వైస్ ప్రెసిడెంట్,పి మహేష్ యస్ సుందర్ రావు,వైఎస్ఆర్ సీపీ నాయకులు,సోడేపలి బుటాన్న, సర్పంచ్ వెంగాడ,జన్ని కనయ్య వైస్ ప్రెసిడెంట్,బి శంకర్ రావు వార్డ్ మెంబర్ చిప్పపల్లి,సిహెచ్ సన్యాసిరావు మండల కార్యవర్గ సభ్యులు,కె ప్రసాద్ గ్రామ కమిటీ అధ్యక్షులు,అంటిపర్తి పెంటయ్య, గ్రమకమిటి అధ్యక్షులు,ఎం కృష్ణారావు వార్డ్ మెంబర్ బొంత శంకర్రావు బంటు శంకర్రావుసర్పంచులు,ఎంపీటీసీలు,నాయకులు, కార్యకర్తలు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




# అభివృద్ధి పనులను పరిశీలించిన కార్పొరేటర్



**విశాఖ తూర్పు, పెన్ పవర్, నవంబరు 15**:జీవీఎంసీ 13వ వార్డు విష్ణుపురి కాలనీ లో జీవీఎంసీ నిధులతో జరుగుతున్న సిసి రోడ్లు పనులను వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణ స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవీఎంసీ ప్రత్యేక నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలను వార్డులో చేపట్టమని,దానిలో భాగంగా విష్ణుపురి కాలనీలో రోడ్లు కాలువలు నిర్మాణ పనులను ఆమె శనివారం రోడ్లు కాలువలు పనులు త్వరితగతిని పూర్తి చేయాలని అధికారులకు తెలిపారు

ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు కొండల రాజు,దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

# కుంబిరిపడలో బిర్సాముండా జయంతి వేడుకలు

పంచాయతీ కార్యదర్శి వి చిన్నన్న, తెదేపా యూనిట్ ఇన్చార్జి సిహెచ్ బాపూజీ.




**ముంచంగిపుట్టు, పెన్ పవర్, నవంబరు 15.**మండలంలో గల మాకవరం పంచాయతీ, కుంబిరిపడ గ్రామంలో భగవాన్ బిర్సా ముండా 150జయంతి వేడుకలు టిడిపి యూనిట్ ఇంచార్జి చెండా బాబూజీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బిర్సా ముండా జయంతి వేడుకల్లో పాల్గొన్న పంచాయతీ కార్యదర్శి వి చిన్నన్న, బాపూజీలు మాట్లాడుతూ.. భారతదేశ చరిత్రలో బ్రిటీష్ ఆధిపత్యం అణచివేతకు వ్యతిరేకంగా భూమి భుక్తి విముక్తి కోసం ఆయుధం పట్టి ఉద్యమాలకు, పోరాటాలకు పురుడు పోసిన ఆదివాసి నేత బిర్సాముండా అని వారు అన్నారు. ఆదివాసి గిరిజనులందరూ బిర్సా ముండాకు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామంలో బిర్సాముండా చరిత్ర ఒక ప్రధాన ఘట్టంగా వారు అభివర్ణించారు. జార?ండ్ రాష్ట్రం, రాంచి సమీపంలో గల ఉలిహాటు ప్రాంతంలో 1875 నవంబర్ 15న జన్మించారని, చిన్నతనం నుండి పోరాటాలపై ఆసక్తి కలిగి భారత స్వాతంత్ర్య సమరంలో బిర్షముండా చేసిన పోరాటం చిరస్మరణీయమని వారు అన్నారు. అనంతరం గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్ అనే కార్యక్రమం పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో దేశం పార్టీ నేతలు కే గణపతి, రామ్ చందర్, నగేష్, క్రాంతి కుమార్, ప్రహ్లాద్, మోహన్ బాబు, హరి బందు, రామదాసు, విఆర్పి సూరి, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 30వ వార్డులో వైసీపీకి భారీ ఎదురుదెబ్బ





**100 మందికి పైగా జనసేనలో చేరిక**

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 15** :విశాఖ దక్షిణ నియోజకవర్గంలో జనసేన శక్తి మరింత పెరుగుతోంది. శనివారం నగరంలోని జనసేన పార్టీ కార్యాలయంలో 30వ వార్డు సత్యనారాయణ స్వామి దేవాలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కోరివాడ ఆనంద్ ఆధ్వర్యంలో వైసీపీ నుండి మహిళలు, యువకులు సహా దాదాపు 100 మంది జనసేనలో చేరారు.ఈ చేరిక కార్యక్రమానికి విశాఖ దక్షిణ నియోజకవర్గ శాసన సభ్యులు వంశీ కృష్ణ శ్రీనివాస్ హాజరై కొత్తగా చేరిన వారిని ఆహ్వానించారు. పవన్ కళ్యాణ్ గారి సిద్ధాంతాలు, వంశీ కృష్ణ శ్రీనివాస్ గారి అభివృద్ధి కార్యక్రమాలు ఆకర్షించడంతో జనసేనలో చేరినట్లు సాలిపేట ప్రాంతానికి చెందిన ఎల్.రాజు, జనార్ధన్, వినయ్, అప్పల రాజు, యేసు, నాగరాజు, ఎం.వి.ఎస్. ఎన్.మూ ర్తి, పి.కృష్ణ, రాజేష్, కిరణ్, ఈశ్వరరావు, లక్ష్మి, మంగవేణి, త్రివేణి తదితరులు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ 30వ వార్డులో జనసేన బలమైన నాయకత్వం ఏర్పడింది. నాయకత్వం బలంగా ఉన్న చోటే అభివృద్ధి వేగంగా జరుగుతుంది. అందుకే ప్రజలు జనసేన వైపు ఆకర్షితులవుతు న్నారు. పవన్ కళ్యాణ్ గారు ఎల్లప్పుడూ యువ నాయకత్వాన్ని ప్రోత్సహించాలని చెబుతారు. మీకు ఏ సమస్య వచ్చినా నేను మీకు అండగా ఉంటాను" అని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో 30వ వార్డు జనసేన అధ్య క్షులు యజ్ఞశ్రీ, నాయకులు జన, వినయ్, శంకర్, జనసేన సైనికులు, వీరామహిళలు పాల్గొన్నారు.

# కేజిహెచ్‌లో జాతీయ నూతన శిశు వారోత్సవం ప్రారంభం

"ప్రతి ముద్దు - ప్రతి సారి - ప్రతి బిడ్డకు భద్రత" సందేశంతో కార్యక్రమం

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, నవంబర్ 15 :** కింగ్ జార్జ్ ఆసుపత్రిలో జాతీయ నూతన శిశు వారోత్సవం–2025 ఘనంగా ప్రారంభమైంది. "ప్రతి ముద్దు – ప్రతి సారి – ప్రతి బిడ్డకు భద్రత" అనే ప్రధాన భావంతో జరిగిన ఈ కార్యక్రమాన్ని కేజిహెచ్ వైద్యాధికారి డా. ఐ. వాణి, శిశువైద్య విభాగాధిపతి డా. బి.ఎస్. చక్రవర్తి ప్రారంభించారు.నూతన శిశువుల భద్రత, నాణ్యత, పోషణ ప్రతి బిడ్డకు పుట్టుకతో లభించాల్సిన హక్కులని వైద్యులు పునరుద్ఘా టించారు. శిశు సంరక్షణ సేవలను మరింత ప్రమాణాలతో అందించేందుకు అధ్యాపకులు, వైద్యుల శిక్షణలో ఉన్నవారు, నర్సింగ్ సిబ్బంది, తల్లిదండ్రులు అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

కేజిహెచ్‌లో నూతన శిశు ప్రత్యేక చికిత్సా విభా గం (ఎన్ఐసియు–ఎస్ఎన్‌సియు) సేవలను అభివృద్ధి చేసే దిశగా పలు చర్యలు చేపడుతు న్నట్టు అధికారులు తెలిపారు. ఇదే సందర్భంగా డిసెంబర్ 11న మాతృపాల బ్యాంకు మరి యు నాడీ అభివృద్ధి శిక్షణ శిబిరం నిర్వహిం చనున్నట్లు ప్రకటించారు.



ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డా. ఐ. వాణి, సామాజిక బాధ్యతా విభాగ వైద్య అధికారి డా. యు. శ్రీహరి, శిశువైద్య విభాగాధిపతి డా. బి.ఎస్. చక్రవర్తి, శిశువైద్య విభాగ వైద్యులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళా డిగ్రీ కాలేజీలో ప్రవేశాలకు దరఖాస్తు.



ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు.

**అరకులోయ పెన్ పవర్ 15 :**ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయ మండల కేంద్రం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ కోర్స్ లకు తక్షణమే ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరణ జరుగుతుందని ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు ఒక పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు.అరకులోయ మహిళ డిగ్రీ కళాశాలలో మిగిలి ఉన్న సైట్లుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఇంటర్మీడియట్ అర్హత కలిగిన వారు డిగ్రీలో చేరాలను కొనే వారికి ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.హిస్టరీలో 16.పొలిటికల్ సైన్స్ లో 28.బి.కం. 46. బి.కం.సి. ఏ లో 9.మ్యాథమాటిక్స్ లో 19. ఫిజిక్స్ లో 10 .సీట్లు ఖాళీలు ఉన్నాయిని ఆసక్తి ఉన్న విద్యార్థులు కళాశాల కార్యాలయంని సందర్శించి వివరాలు నమోదు చేసుకోవాలని ఒక పత్రిక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు

## బిర్సాముండాకు ఘన నివాళులు.



**అరకులోయ పెన్ పవర్ 15 :**ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయ మండల కేంద్రం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో శనివారం భగవానన్ బిర్షముండా జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ సమావేశ మందిరములో బిర్సాముండా ఫోటోకు నివాళులు అర్పించారు.ఆయన చిత్రపటానికి పూల దండ అలంకరించి, దీపారాధన చేసి, ఆయన చేసిన పోరాట, త్యాగము గురించి ఎం.పి.డి.ఓ లోవరాజు క్లుప్తంగా తెలిపారు. బిర్సాముండా గురించి ఉద్యమసూర్తిని తీసుకుని ఆదివాసుల ప్రజాస్వామిక హక్కుల కోసం పోరాడాలని అశోక్ పిలుపునిచ్చారు. మరొకమారు వారి గొప్పతనాన్ని స్మరించుకోవడము జరిగినదన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహ మూర్తి, పూర్ణ చందర్ బస్కి సర్పంచ్ పాడి రమేష్. పరిపాలనాధికారి ఉదయ భాస్కర్ , ఇతర సిబ్బంది, ఎం.జి.ఎం.ఆర్.ఇ.జి.యస్. సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సింహాచలంలో చందన సమర్పణకు భక్తుని విశిష్ట దాతృత్వం



### ఆలయాధికారుల భక్తునికి ప్రశంసలు

**సింహాచలం, పెన్ పవర్, నవంబర్ : 15 :** భక్తి, దాతృత్వం, ఆధ్యాత్మికతల సమ్మేళనంతో విశాఖపట్నంలోని పర్వతశ్రేణుల మధ్య వెలసిన శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామివారి దేవస్థానంలో నేడు విశేషమైన సేవ కార్యక్రమం జరిగింది. కోల్‌కతాకు చెందిన భక్తులు ప్రవేష్ దుదాని స్వామివారి చందన సమర్పణ కోసం ప్రత్యేకంగా సింహాచలం ఆలయానికి విచ్చేసి, భక్తి భావంతో రూ.2 లక్షల విరాళాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమం ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షణాధికారి బి.సత్య శ్రీనివాస్ సమక్షంలో జరగడం విశేషం. ఆలయ అధికారులు దాత నుంచి విరాళాన్ని స్వీకరించి అధికారిక రసీదు అందజేశారు.

తరువాత వేద పండితులు దుదానికి వేద ఆశీర్వచనాలు అందించి, స్వామివారి కటాక్షం నిలకడగా ఉండాలని ప్రార్థించారు. అనంతరం ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె. తిరుమలేశ్వరరావు దాతను శేషవస్త్రంతో సత్కరించి, స్వామివారి ప్రత్యేక తీర్థప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు మాట్లాడుతూ భక్తుల నుంచి లభిస్తున్న ఇలాంటి దాతృత్వం సింహాచలం దేవస్థాన అభివృద్ధికి, స్వామివారి నిత్య సేవలకు ఎంతో మద్దతు ఇస్తుంది. భక్తుని ఈ చందన సమర్పణ సేవ విశేషమైనదని పేర్కొన్నారు. ప్రవేష్ దుదాని తన భావాలను వ్యక్తం చేస్తూ, స్వామివారి దయానుగ్రహంతో ఈ సేవ చేయగలిగాను. నిత్యం సింహాచల నరసింహస్వామి ఆశీర్వాదం కోరుకుంటున్నానని చెప్పారు. భక్తి పూర్వకంగా జరిగిన ఈ చందన సమర్పణ కార్యక్రమం ఆలయంలోని భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించింది.



ఒరిజినల్

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారి దేవస్థానము

సింహాచలం, విశాఖపట్నం - 28

తేది : 15.11.2025

మిసిలేనియస్ రశీదు నెం. 4163

పేరు : Sri pravesh Dudani

చిరునామా : Tolly—6—A

ఎందు నిమిత్తం : 7A Active Acres

Goel Gotram calcutta

ph NO: 9811266444

Sri swamy variki chandanam Donation purpose.

చెల్లించిన సొమ్ము రూ. 2,00,101=00

(అక్షరముల రెండు లక్షల నూట ఒక రూపాయలు మాత్రమే

కార్యనిర్వహణాధికారి తరఫున సింహాచలం దేవస్థానం.

# లంగ్బాపాదొర్, మట్టిగూడలలో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

- పంచాయతీలో మొదటి సిసి రోడ్లు నిర్మాణాలు జరుగుతుండడంతో గ్రామస్తుల హర్షం.
- జిల్లా పరిషత్ నిధులు కేటాయించిన జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, నవంబర్ 15.**మండలంలో గల మారుమూల రంగబయలు పంచాయితీ, లంగ్బపాదొర్, మట్టిగూడ గ్రామాలలో జెడ్పినిధులతో సిసి రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేసినట్లు స్థానిక సర్పంచ్ వంతాల ధన్య, ఎంపిటిసి సిరగం భాగ్యవతి, వైసిపి జె సి ఎస్ జిల్లా కోఆర్డినేటర్ అరబీరు జగబంధు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ.. సుమారుగా 10 లక్షల రూపాయలతో రెండు గ్రామాలకు సుమారు 200 మీటర్లు జిల్లా పరిషత్ నిధులతో సిసి రోడ్లు నిర్మాణాలకు శంకుస్థాపన చేశామన్నారు. స్వాతంత్ర్య అనంతరం నేటి వరకు ఒక్క సిసి రోడ్డు కూడ ఆ పంచాయతీలో లేకపోవడం, ఇదే మొదటిగా రెండు గ్రామాల్లో సిసి రోడ్లు నిర్మాణాలు జరుగుతున్న నేపథ్యంలో ఆయా గ్రామాల ప్రజలు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కు కృతజ్ఞతలు తెలిపారు. తమ పంచాయతీ పరిధిలో జడ్పీ చైర్ పర్సన్ సిసి రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించడం పట్ల సర్పంచ్, ఎంపీటీసీలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీను, వైసీపీ నాయకులు గొల్లోరీ దేవా, బుద్ధ, దొంబ్రు, మంగ్ల పూజారి లక్ష్మణ్, పంచాయతీ సెక్రటరీ భగత్రాం, ఇంజనీర్ అసిస్టెంట్ సుదీర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సర్పంచ్ కొర్ర సుభద్ర సారాధ్యంలో బీర్సాముండా జయంతి వేడుకలు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్ 15:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండల కేంద్రంలో గల జీకే వీధి సచివాలయంలో స్థానిక సర్పంచ్ కొర్ర సుభద్ర ఆధ్వర్యంలో బీర్సా ముండ 150 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. ఆయన పోరాటపటిమను, స్వాతంత్ర కాంక్షను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కిట్లంగి బాలకృష్ణ,ఉప సర్పంచ్ కొర్ర రాంబాబు, వార్డు సభ్యులు కొర్రా గణేష్, పేసా కమిటీ కార్యదర్శి వంతల జగన్రావు, సచివాలయం సిబ్బంది పవన్ తదితరులు పాల్గొన్నారు.

## పెద బరడ సచివాలయంలో బిర్సాముండా జయంతి వేడుకలు -సర్పంచ్ సమిడి గోపాల్




**చింతపల్లి పెన్ పవర్ నవంబర్ 15 :-** చింతపల్లి మండలం పెదబరడ గ్రామ సచివాలయంలో ఆదివాసీ ముద్దు బిడ్డ విప్లవ నేత, బిర్సా ముండా 150వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు, సచివాలయం సిబ్బంది సమన్వయంతో సర్పంచ్ సమిడి గోపాల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఆయన జీవితం, బ్రిటిష్ ఆక్రమణకు వ్యతిరేకంగా చేసిన తిరుగుబాటు, ఆదివాసీ హక్కుల కోసం నడిపిన ఉద్యమాలను వక్తలు స్మరించారు. బిర్సా ముండా చూపిన త్యాగం, ధైర్యం, సామాజిక న్యాయం పట్ల ఆయన నిబద్ధత నేటి యువతకు మార్గదర్శకమని పలువురు అభిప్రాయపడ్డారు. ఆదివాసీ సమాజ అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషిని నేటికీ కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అబ్బాయి నాయుడు, ఏఎంసీ డైరెక్టర్ కేశవ, వార్డ్ సభ్యుడు కోసూరు లక్ష్మణ్, పీసా ఉపాధ్యక్షులు పొట్టుకూరి దారబాబు, వీఆర్వో శ్రీను, హెల్పర్ అసిస్టెంట్ రాజశేఖర్, ఆశా వర్కర్లు, అంగన్వాడి టీచర్లు, సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమం పుష్పాంజలి కార్యక్రమం నిర్వహించగా వేడుకలు సందడిగా కొనసాగాయి.

## 10వ వార్డులో కోటి సంతకాల సేకరణ



**విశాఖ తూర్పు,పెన్ పవర్, నవంబరు15**:10 వ వార్డు అధ్యక్షులు పతివాడ కనకరాజు ఆధ్వర్యంలో 61వ బూత్ రవీంద్ర నగర్ లో బూత్ కన్వీనర్లు సామంతుల నారాయణ రావు హరిబాబు గడప గడపకు వెళ్ళి మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణను వ్యతిరేకంగా ప్రజాభిప్రాయ తెలిపే కోటి సంతకాల సేకరణ సేకరణ శనివారం చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పతివాడ వెంకటలక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.ం

## జర్రెల పాఠశాల విద్యార్థులను పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు





**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్ 15**: గత మూడు రోజుల క్రితం జర్రెల గవర్నమెంట్ గిరిజన ఆశ్రమా పాఠశాలలో విద్యార్థులు కల్తీ ఆహారం తిని తీవ్ర అస్వస్థతకు గురి అయ్యారని తెలుసుకున్న మాజీ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు వంతల సుబ్బారావు, చింతపల్లి మాజీ ఎంపీపీ వంతల బాబురావు శనివారం పాఠశాలకు వెళ్లి విద్యార్థులను పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించి విద్యార్థులకు సరైన వైద్యం అందించాలని డాక్టర్ను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మొట్టడం బాలరాజు, పాంగి శ్రీనుబాబు, గెమ్మెలి సింహాద్రి, వంతల రవి, వంతల శ్రీను, మర్రి సూర్యనారాయణ,కొర్ర జగన్, పాంగి కృష్ణ, గుంట రాజు, మర్రి రాంబాబు, పాంగి చిన్నారావు,కొర్ర చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

## పీడీ జ్ఞానేశ్వర్‌కు సత్కారం



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, నవంబర్ 15:**రింతాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం పాఠశాల యాజమాన్యం, విద్యార్థుల మెరుగైన తర్ఫీదు కోసం నిరంతరం కృషి చేస్తున్న పీడీ జ్ఞానేశ్వర్‌ను సత్కరించింది. 9వ తరగతి విద్యార్థిని శ్యామలాదేవి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడానికి పీడీ జ్ఞానేశ్వర్ చేసిన ప్రోత్సాహక పాత్రకు గుర్తింపు ఇస్తూ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అప్పలనాయుడు, స్థానిక వైస్ సర్పంచ్ సోమేష్ కుమార్ మరియు ఉపాధ్యాయులు ఆయనకు సన్మానం చేశారు.

# చింతపల్లిలో విలేకరులకు పునశ్చరణ తరగతులు ప్రారంభం





* రాష్ట్రప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్

**చింతపల్లి పెన్ పవర్ నవంబర్ 15 :-** చింతపల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో 15,16,తేదీ లో రెండు రోజులు పాటు నిర్వహించనున్న పునశ్చరణ కార్యక్రమానికి ఏపీయూడబ్ల్యూజే చింతపల్లి ప్రెస్ క్లబ్ సారథ్యంలో సి ఆర్ మీడియా ( ప్రెస్ అకాడమీ) ఆధ్వర్యంలో విలేకరుల పునశ్చరణ కార్యక్రమాన్ని శనివారం , జ్యోతి ప్రజ్వాలన చేసి విద్యార్థునిలతో వందేమాతరం గీతంతో ప్రారంభించారు, నేటి సమాజానికి విలువలతో కూడిన జర్నలిజం ఎంతో అవసరమని ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ పిలుపునిచ్చారు. సభాధ్యక్షత వహించిన సి ఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టులు ఎప్పుడు నిత్య అభ్యాసకులుగా విషయ పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలని సూచించారు. లీడర్ పత్రికా సంపాదకులు వివి రమణమూర్తి పరిశోధనాత్మక జర్నలిజం విధి విధానాలను పరిశోధనాత్మక విశ్లేషణలు వార్తల సేకరణపై వివరించారు. ఆంధ్ర యూనివర్సిటీ హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ రిటైర్డ్ జర్నలిజం అధ్యాపకులు బాబివర్ధన్ క్రైమ్ వార్తల్లో పాటించాల్సిన మెళకువలు, ఏ వార్తలు క్రైమ్ వార్తలు పరిధిలోకి వస్తాయనే విషయాలను విపులంగా వివరించారు. ఐజేయు సెక్రటరీ జనరల్, సీనియర్ పాత్రికేయులు డి సోమసుందర్ జర్నలిజం లో నైతిక విలువలు, జర్నలిస్టులు అవలంబించాల్సిన విధి విధానాలు కూలంకషంగా వివరించారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి సతీష్, డి పద్మరాజు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు వనరాజు, గౌరవ అధ్యక్షులు ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా వసపరి దయానంద్, ఎలక్ట్రానిన్ మీడియా ప్రధాన కార్యదర్శి కె అప్పలరాజు ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ స్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగరాజు, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కార్యదర్శి చింతల కిషోర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేష్, విశాఖ జిల్లా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామచంద్ర రావు, అనకాపల్లి జిల్లా ఏపీడబ్ల్యూజే అధ్యక్షులు జోగినాయుడు, సీనియర్ పాత్రికేయులు నాగేశ్వరరావు స్థానిక ఎంపీడీవో తో పాటు చింతపల్లి ప్రెస్ క్లబ్ పాత్రికేయులు, కొయ్యూరు జికె వీధి, జి మాడుగుల, పాడేరు,, చోడవరం మాడుగుల నర్సీపట్నం పాత్రికేయులు పాల్గొన్నారు



# అభ్యుదయ సైకిల్ యాత్ర"కు విశేష స్పందన





* డ్రగ్‌ల ముప్పుపై ప్రజల్లో పెరుగుతున్న అప్రమత్తత
* నర్సీపట్నం నుంచి రోలుగుంట వరకు భారీ అవగాహనా ర్యాలీ
* వేలాది మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొనడం విశేషం

**అనకాపల్లి జిల్లా, పెన్ పవర్, నవంబర్ 15 :** విశాఖపట్నం రేంజ్ పరిధిలో మాదకద్రవ్యాల నిర్మూలన కోసం జిల్లా పోలీసు శాఖ చేపట్టిన "అభ్యుదయ సైకిల్ యాత్ర శనివారం నర్సీపట్నం టౌన్‌లో ఘనంగా ప్రారంభమైంది. యువతలో డ్రగ్‌ల ప్రమాదాలపై అవగాహన పెంపు లక్ష్యంగా చేపట్టిన ఈ యాత్ర, రోలుగుంట వరకు సాగి ప్రజల నుంచి విశేష స్పందనను అందుకుంది.

**నర్సీపట్నం టౌన్‌లో ఉత్సాహభరిత ప్రారంభం..**

ఉదయం 10 గంటలకు అబిడ్స్ సెంటర్ వద్ద ఓపెన్ స్టేజ్ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం. దేవ ప్రసాద్, డీఎస్పీ పి. శ్రీనివాసరావు, నాయకులు, అధికారులు పాల్గొని యాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వివిధ కళాశాలలు, పాఠశాలలకు చెందిన దాదాపు 1000 మంది విద్యార్థులు హాజరై ర్యాలీకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ప్రత్యేకంగా విద్యార్థుల చిన్న నాటికలు డ్రగ్‌ల దుష్పరిణామాలను హృదయానికి హత్తుకునేలా చూపి అందరి దృష్టిని ఆకర్షించాయి.

**డ్రగ్ బాధిత కుటుంబాల కన్నీరు పెట్టించే అనుభవాలు..**

కార్యక్రమంలో డ్రగ్‌ల కారణంగా నష్టపోయిన కుటుంబాలు తమ బాధను పంచుకున్నాయి. రవణపు ఆనంద్ కుమార్ అన్నయ్య డ్రగ్స్‌కు బానిసై మరణించిన సంఘటన, నులు ప్రసన్న కుమార్ కుమారుడు డ్రగ్స్ కారణంగా మానసిక రుగ్మతకు లోనై జీవితం చీకటిమయం అయిన విషయం. అక్కడి ప్రజలను తీవ్రంగా కదిలించాయి. పోలీసు అధికారులు డ్రగ్ వినియోగం ఒక వ్యక్తిని మాత్రమే కాక మొత్తం కుటుంబాన్ని, సమాజాన్ని ప్రభావితం చేస్తుందని వివరించి అందరికీ యాంటీ-డ్రగ్ ప్రతిజ్ఞ చేయించారు.

**చెట్టిపలి-నర్సీపట్నం రూరల్ వరకు భారీ ర్యాలీ..**

విశాలంగా సాగిన సైకిల్ యాత్ర చెట్టిపల్లి, నర్సీపట్నం రూరల్ ప్రాంతాల గుండా ముందుకు సాగి, ప్రతి చోట ప్రజలు ర్యాలీని స్వాగతిస్తూ అవగాహన సందేశాలను స్వీకరించారు.

**రోలుగుంట పీఎస్ హద్దుల్లో ఘన స్వాగతం..**

కొత్తకోట సర్కిల్, రోలుగుంట పీఎస్ పరిధిలోకి ర్యాలీ ప్రవేశించగానే సీఐ జి. కోటేశ్వరరావు, ఎస్సై పి. రామకృష్ణరావు మరియు సిబ్బంది ఘన స్వాగతం పలికారు. స్థానికంగా 200 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ర్యాలీకి జతై ఏకగ్రీవ మద్దతు తెలిపారు. డ్రగ్‌ల ప్రమాదాలు, వాటిని నివారించే మార్గాలు, పౌరుల బాధ్యతలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే యాంటీ-డ్రగ్ ప్రతిజ్ఞ చేయించడం, పాంప్లెట్ల పంపిణీ జరిగింది.

కుటుంబం సమాజంపై డ్రగ్‌ల ప్రభావంపై స్పష్టమైన సందేశం. స్యాయిల్ యాత్ర ప్రధానంగా ప్రసారం చేసిన అంశాలు. కుటుంబంపై ప్రభావం. డ్రగ్‌లకు బానిసైతే ప్రేమ, నమ్మకం, సంబంధాలు దెబ్బతింటాయి. ఆర్థిక సమస్యలు తీవ్రమవుతాయి. అలవాట్ల కోసం నేరాలకు దారితీయగల ప్రమాదం పెరుగుతుంది. సమాజంపై ప్రభావం డ్రగ్స్ అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో నేరాలు పెరుగుతాయి. విద్యార్థులు చదువు మధ్యలో వదిలే ప్రమాదం. యువత దెబ్బతింటే దేశ భవిష్యత్తు బలహీనమవుతుంది. పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినా కుటుంబాలు, విద్యాసంస్థలు, సమాజం కలిసి పనిచేసినప్పుడే డ్రగ్ వ్యసనాన్ని పూర్తిగా అరికట్టగలమని అధికారులు పేర్కొన్నారు.

**డీఐజీ సందేశం.. "డ్రగ్‌ల నివారణ ప్రతి పౌరుడి బాధ్యత"**

విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టీ, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ర్యాలీని అభినందిస్తూ విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలు, పోలీస్ అధికారుల సేవాభావాన్ని ప్రశంసించారు. డ్రగ్‌ల నివారణ కేవలం పోలీసుల పని కాదుబీ ప్రతి కుటుంబం, ప్రతి పౌరుడి బాధ్యత. తల్లిదండ్రులు పిల్లలతో స్వేచ్ఛగా మాట్లాడాలి, తొలి సంకేతాలను గమనించాలి. డ్రగ్‌లురహిత భవిష్యత్తు నిర్మాణం కోసం సమాజం మొత్తం ఏకమై పనిచేయాలి. అనకాపల్లి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభ్యుదయ సైకిల్ యాత్ర ప్రజల్లో ఔత్సాహిక స్పందనను రేకెత్తిస్తుంది. డ్రగ్‌ల ముప్పుపై అవగాహన పెంపుకు ఇది ఒక ముఖ్యమైన అడుగుగా నిలుస్తోంది.





# పద్మనాభనగర్ హైస్కూల్లో ఘనంగా జాతీయ బాలలదినోత్సవ వేడుకలు







**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, నవంబర్ 15 :** గ్రేటర్ విశాఖ 92వ వార్డు పరిధిలోని పద్మనాభ నగర్ హైస్కూల్లో జాతీయ బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం విద్యార్థులు విచిత్ర వేషధారణలతో స్కూల్‌కు హర్షోత్సాహాలతో తరలివచ్చారు. బాలల సృజనాత్మకతను వెలుగులోనికి తీసేందుకు పలు రకాల ఆటల పోటీలు, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమం పండిత జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు అర్పించి ప్రారంభమైంది. అనంతరం విద్యార్థినీ-విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమాల రూపంలో నృత్య-గీతాలను ఆరబోసి కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన పద్మనాభ నగర్ గ్రామాభ్యుదయ యువజన సేవా సంఘం అధ్యక్షులు, రాష్ట్ర యువశక్తి అవార్డు గ్రహీత నందవరపు సోములు మాట్లాడుతూ పండిత జవహర్లాల్ నెహ్రూకు బాలలు అంటే అపారమైన మమకారం. బాలలతో ప్రతిరోజూ సమయం గడపడం ఆయనకు ఎంతో ఇష్టమై ఉండేది. అందుకే ఆయన జన్మదినాన్ని జాతీయ బాలల దినోత్సవంగా దేశం ఘనంగా జరుపుకుంటోంది. నేటి బాలలే రేపటి పౌరులు. దేశాభివృద్ధి, జాతీయతా భావం, మంచి నడవడికలను అలవరచుకుంటూ ప్రతి విద్యార్థి చదువులోను, శీలంలోను ముందుండాలి. తల్లిదండ్రులకు, పాఠశాలకు గర్వకారణంగా నిలిచే వ్యక్తులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన హెడ్‌మాస్టర్ శ్రీనివాస్, జెడి ఫౌండేషన్ ప్రతినిధి కృష్ణయ్య, సంఘం ఉపాధ్యక్షులు వల్లూరి జగదీష్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు సత్యనారాయణ, అప్పలనాయుడు, రమాదేవి తదితరులు బాలలను ఉద్దేశించి ప్రసంగించారు. బాలల ప్రతిభను మెచ్చుకొని వారిని మరింత అభివృద్ధి సాధించేందుకు ప్రోత్సహించారు. తరువాత నిర్వహించిన ఆటల పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు ముఖ్య అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమం ముగిసిన అనంతరం విద్యార్థులకు స్వీట్లు, చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేయడం జరిగింది. పూర్తి ఉత్సాహం, సందడి నిండిన ఈ వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఆరు ఏళ్ల తర్వాత గంజాయి కేసు ముద్దాయి అరెస్ట్

పాత కేసులపై సిటీ పోలీసుల దాఖలు దాడులు



**ములగాడ, పెన్ పవర్, నవంబర్ 15 :**పాత కేసులను వేగంగా ముగించాలనే లక్ష్యంతో సిటీ పోలీస్ కమిషనర్ శంకాబ్రతా బగ్చి చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో భాగంగా, ఆరు సంవత్స రాలుగా పారిపోయిన ముద్దాయి ఒకరు పోలీ సులకు చిక్కాడు. 2020 ఫిబ్రవరిలో కోరమం డల్ పారిశ్రామిక ప్రాంతంలోని కర్మాగారంలో లారీ అన్‌లోడ్ చేస్తుండగా పెద్ద మొత్తంలో గంజాయి పట్టుబడిన ఘటనలో మల్కాపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. అయితే, ఆ సమయంలో ప్రధాన ముద్దాయి పరారయ్యాడు.పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పాత కేసులపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టిన మల్కాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ గొలగాని అప్పారావు, తన బృందంతో కలసి ముద్దాయిని గుర్తించేందుకు సాంకేతిక ఆధారాలను వినియోగించారు.సుమారు వారం రోజులు ఒడిశాలో మాటువేసి, చివరకు బిజే కబాసిని అదుపులోకి తీసుకున్నారు.

ఎన్ని సంవత్సరాలు గడిచినా తప్పుచేసినవాడు చట్టం నుంచి తప్పించుకోలేడు అని సిఐ అప్పా రావు పత్రికా సమావేశంలో స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ముద్దాయిని రిమాండ్‌కు పంపించారు.

# స్వచ్ఛఆంధ్రలో భాగంగా సింహాచలం దేవస్థానంలో శుభ్రత కార్యక్రమం

ఉద్యోగులతో 'స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ' చేయించిన ఈవో ఎన్.సుజాత





**సింహాచలం, పెన్ పవర్, నవంబర్ 15 :** శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామివారి సింహాచలం దేవస్థానంలో 'స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం శనివారం విశేషంగా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా పరిశుభ్రతను పెంపొందించేందుకు గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు జరుగుతున్న ఈ ఉద్యమంలో భాగంగా, దేవస్థానం పరిశుభ్రతను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారిణి ఎన్. సుజాత పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈ.ఓ సింగం రాధ, సహాయ కార్యనిర్వహణాధికారులు కె. తిరుమలేశ్వరావు, వాడ్రేవు రమణమూర్తి చురుకుగా వ్యవహరించారు. రాజగోపురం ఎదుట ప్రాంగణం, సింహగిరి పరిసరాలు యాత్రికులు ఎక్కువగా సంచరించే మార్గాలు దేవాలయం ప్రధాన ప్రాంతాల్లో భారీ స్థాయిలో శుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. శానిటేషన్ విభాగం సిబ్బంది తోపాటు ఇతర విభాగాల ఉద్యోగులు కలిసి ఆలయంలోని అన్ని ముఖ్య ప్రదేశాలను పూర్తిగా శుభ్రం చేశారు. భక్తులకు స్వచ్ఛమైన ఆధ్యాత్మిక వాతావరణం అందించడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు.

**ఉద్యోగులందరూ 'స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ..**

శుభ్రత కార్యక్రమం అనంతరం ఆలయ ప్రాంగణంలో పాల్గొన్న ఉద్యోగులతో 'స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ' చేయించబడింది. ఇందులో వారు క్రింది అంశాలను పాటిస్తామని సంకల్పం చేశారు. ప్రతిరోజూ పరిశుభ్రత కోసం కొంత సమయం కేటాయించడం, శ్రమదానం ద్వారా శుభ్రతలో భాగస్వామ్యం కావడం, తడి చెత్త %-% పొడి చెత్తను వేరు చేయడం పై భక్తుల్లో అవగాహన కల్పించడం, పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ సాధనలో చురుకుగా పాల్గొంటామని ప్రతిజ్ఞ చేశారు.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ

"స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాన్ని చేరుకోవడంలో సింహాచలం దేవస్థానం కీలక పాత్ర పోషిస్తుంది. స్వచ్ఛ సింహాచలంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తాం. భక్తులు కూడా ఆలయ పరిశుభ్రతలో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ విభాగం ఏ.ఈ.ఓ పంతం శ్రీనివాస్, పర్యవేక్షణ అధికారులు కంచి మూర్తి రమణ, జోగారావు, వాసు, పి.ఆర్.ఓ నాయుడు తదితర సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

# సిఐఐ సమ్మిట్‌లో అమరావతి డిజిటల్ ట్విన్‌వే ప్రత్యేక ప్రదర్శన

డిజిటల్ ట్విన్‌వే నమూనాను పరిశీలించిన ప్రభుత్వ విప్ గణబాబు





**విశాఖపట్నం, పెన్ పవర్, నవంబర్ 15 :** నగరంలో జరుగుతున్న సిఐఐ సమ్మిట్ లో ఏర్పాటు చేసిన 'అమరావతి డిజిటల్ ట్విన్‌వే' ప్రత్యేక ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంటోంది. ఈ ప్రదర్శనను శనివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు పలువురు ఎమ్మెల్యేలతో కలిసి సందర్శించి పరిశీలించారు. అమరావతి భవిష్యత్ రూపురేఖలను డిజిటల్ రూపంలో ప్రతిబింబించే ఈ ట్విన్‌వే మోడల్ నగర నిర్మాణం, రహదారుల ప్రణాళిక, ప్రభుత్వ భవనాలు, జలవనరులు, స్మార్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటివి అత్యంత స్పష్టంగా చూపిస్తుంది. ఇది అమరావతి అభివృద్ధి దిశలో ప్రభుత్వం చేపడుతున్న కీలక వినూత్న కార్యక్రమాలలో ఒకటిగా నిర్వాహకులు వివరించారు.

ప్రదర్శన అనంతరం మీడియాతో మాట్లాడిన ప్రభుత్వ విప్ గణబాబు అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దడంలో డిజిటల్ ట్విన్‌వే వంటి ఆధునిక సాంకేతిక నమూనాలు ఎంతో ఉపయోగకరం. నగర నిర్మాణం మరింత శాస్త్రీయంగా, పారదర్శకంగా ఉండేందుకు ఇవి దోహదపడతాయని తెలిపారు. అలాగే ఈ మోడల్ ద్వారా భవిష్యత్తులో అమరావతిలో ఏర్పడే విభిన్న నిర్మాణాలపై రియల్‌టైమ్ విశ్లేషణ చేయవచ్చని, అభివృద్ధి వేగం పెరుగుతుందని నిపుణులు వివరించారు. సమ్మిట్‌లో పాల్గొన్న ఇతర ఎమ్మెల్యేలూ ఈ ప్రదర్శనపై సానుకూల అభిప్రాయాలు వ్యక్తం చేసి, అమరావతి అభివృద్ధిపై ప్రభుత్వ కట్టుబాటును ప్రజలకు స్పష్టంగా చూపించడానికి ఇది మంచి వేదిక అని అన్నారు.

# ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణలో అనకాపల్లి జిల్లా పోలీసులకు ముందంజ





**శాస కార్యక్రమంలో భాగంగా విస్తృత పరిశుభ్రత చర్యలు**

**అనకాపల్లి, పెన్ పవర్, నవంబర్ 15 :** రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ నెలకు నిర్ణయించిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర" (శాస) కార్యక్రమం థీమ్ ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ. ఈ నేపథ్యంలో అనకాపల్లి జిల్లా పోలీస్ కార్యాలయం పరిధిలో విస్తృత పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహిస్తూ జిల్లా పోలీసులు ఆదర్శప్రాయంగా నిలిచారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ టి.లక్ష్మి నాయకత్వంలో ఈ శ్రమదానం కార్యక్రమం శనివారం ఉదయం ప్రారంభమైంది. కార్యాలయం ప్రాంగణంలో పేరుకుపోయిన పాత కంప్యూటర్లు, కీబోర్డులు, వైర్లు, పాడైపోయిన పరికరాలు, పాత రికార్డు ఫైళ్లు వంటి ఎలక్ట్రానిక్ మరియు స్టేషనరీ వ్యర్థాలను ప్రత్యేకంగా గుర్తించి సేకరించారు.

**కార్యాలయ ప్రాంగణం పూర్తిగా శుభ్రపరచటం..**

పోలీస్ కార్యాలయం ఆవరణ, రికార్డు గదులు, స్టోర్ రూం, పార్కింగ్ ప్రదేశాలు వంటి అంతర్గత ప్రాంతాలన్నింటిలోనూ ప్రత్యేక బృందాలు విస్తృతంగా శుభ్రపరిచే పనులను నిర్వహించాయి. దీర్ఘకాలంగా పేరుకుపోయిన దుమ్ము, చెత్త, ఇ-వేయస్ట్ తొలగించడంతో కార్యాలయం మరింత పరిశుభ్రంగా, సక్రమంగా మారింది. ఎలక్ట్రానిక్ వ్యర్థాల వలన సిబ్బందికి కలిగే ఆరోగ్య సమస్యలు, అగ్ని ప్రమాదాలకు అవకాశం ఉండటం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. పరిశుభ్రమైన వాతావరణం ఉద్యోగుల పనితీరును మెరుగుపరుస్తుందని అధికారులు పేర్కొన్నారు.

**భవిష్యత్తుకు వేస్ట్ మేనేజ్‌మెంట్ చర్యలు..**

కేవలం శుభ్రపరిచడమే కాకుండా, ముందస్తు చర్యలుగా ప్రత్యేక డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేసి, ఇ-వేయస్ట్‌ను వేరు చేసి నిల్వ చేయడానికి ప్రత్యేక ప్లాన్ సిద్ధం చేశారు. భవిష్యత్తులో ఎలక్ట్రానిక్ మరియు ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణను మరింత వ్యవస్థీకృతం చేయాలని జిల్లా పోలీసులు నిర్ణయించారు. ఈ సందర్భంగా మాట్లాడిన స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ టి. లక్ష్మి అన్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణ ప్రతి కార్యాలయంలో ఎంతో కీలకం. పరిశుభ్రమైన వాతావరణం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ప్రజలకు సేవలు అందించే పోలీస్ శాఖ పరిశుభ్రత విషయంలో ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రమాదకర వ్యర్థాలను తొలగించడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పర్యావరణహిత చర్యల భాగంగా మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు కూడా నిర్వహించారు.

**పోలీసుల సమిష్టి శ్రమ..**

కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ టి. లక్ష్మితో పాటు ఎస్సైలు వెంకన్న, విశ్వనాథం, ఇతర పోలీసులు, కార్యాలయ సిబ్బంది పాల్గొని గణనీయమైన శ్రమదానం చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయం, అనకాపల్లి శాస కార్యక్రమాన్ని పురస్కరించుకొని చేపట్టిన ఈ పరిశుభ్రత చర్యలు జిల్లా పోలీసుల సమాజ సేవా భావనను మరోసారి చాటిచెప్పాయి.



# ఒడిస్సా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ పర్యటన ఏర్పాట్లు



- భద్రతా ఏర్పాట్లు ప్రత్యేక దృష్టి సాధించాలి
- జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్

**పాడేరు, పెన్ పవర్,నవంబర్ 15:** నవంబర్ 16వ తేదీన ఒడిస్సా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మార్ఝీ జిల్లాలో పర్యటించనున్నారని, ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

బిర్సా ముండా విగ్రహావిష్కరణ మరియు బహిరంగ సభ ప్రాంతాలలో కట్టుదిట్టమైన భద్రతా తదితర ఏర్పాట్లపై శనివారం జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మార్ఝీ ఒడిషా నుంచి హెలిపాడ్ లో ఉదయం12 గంటల ప్రాంతంలో లెగిసి పెల్లిలో దిగనున్నారు అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన భోజన సత్కారాల స్వీకరించి మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో

చింతలవీధిలో స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా విగ్రహ ప్రారంభోత్సవానికి హాజరుకానున్నారని,విగ్రహావిష్కరణ

అనంతరం, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారు. అక్కడ నుంచి మధ్యాహ్నం 3.30 గంటలకి లెగిసిపల్లి వద్ద తిరిగి హెలిపాడ్ లో ఒడిస్సా కు బయల్దేరునున్నారు. ఈ కార్యక్రమం ఎన్జీవో ఆదివాసి కళ్యాణ్ ఆశ్రమం వాళ్ళ ఆధ్వర్యంలో జరుగుతుందని పేర్కొన్నారు.

ఈ పర్యటన నేపథ్యంలో పాడేరులోని కొన్ని విద్యా సంస్థలకు శనివారం సెలవు ప్రకటించారు. అధికారులు, సిబ్బంది ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని, సభా ప్రాంగణం, వీవీఐపీలు ప్రయాణించే మార్గంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశించారు.

సీఎం పర్యటన నేపథ్యంలో స్పెషల్ పోలీసు బలగాలను మోహరింపు, పర్యటించే ప్రదేశాలలో 24/7 డ్రోన్స్‌తో నిఘా ఏర్పాట్లు, ?పాడేరు పట్టణంలోకి వచ్చే అన్ని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చెప్పాట్టాలన్నారు.

విద్యుత్తు, త్రాగునీరు, పారిశుద్ధ్యం నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, వైద్య ఆరోగ్యశాఖ అంబులెన్స్ సిద్ధం చేయాలని, అలాగే అగ్నిమాపక వాహనాన్ని సిద్ధం చేయాలన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా జనరేటర్లు సిద్ధం చేయాలన్నారు.

# అగ్ని ప్రమాద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు భరోసా







**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, నవంబర్ 15 :** జీవీఎంసీ 59వ వార్డు శాంతిగిరి కాలనీ కొండపై శనివారం సంభవించిన అగ్ని ప్రమాదంలో కొండపై ఉన్న రెండు పూరి పాకలు పూర్తిగా కాలిపోయాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. అగ్ని ప్రమాదం విషయం తెలిసిన వెంటనే ప్రభుత్వ విప్ మరియు ఎమ్మెల్యే గణబాబు సాయంత్రం సంఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాలను పరామర్శించారు. వారి పరిస్థితిపై ఆరా తీసి, ప్రభుత్వం నుంచి వీలైనంత త్వరగా ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకుంటానని వారికి భరోసా ఇచ్చారు. బాధితులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

అలాగే, విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గణబాబు వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందిని ఘటనాస్థలానికి రప్పించి, దెబ్బతిన్న లైన్ల పునరుద్ధరణకు చర్యలు చేపట్టేలా సూచించారు. కాలనీ పరిస్థితిని పరిశీలించి, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఈ సందర్భనలో ములగాడ ఎమ్మార్వో కార్యాలయ సిబ్బంది, స్థానిక కార్పొరేటర్, కూటమి నాయకులు ఎమ్మెల్యే గణబాబు వెంట ఉన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వ సహాయం త్వరగా అందేలా అన్ని విధాలుగా కృషి చేస్తామని వారు తెలిపారు.

# నెల రోజుల వ్యవధిలో ఐదుగురు శిశువుల మృతి

## దారెలా పంచాయతీ తలింబ, కుమ్మరిపుట్టు, చివుకుచింత గ్రామాలలో సంఘటన.

## గ్రామాల్లో వైద్య అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి శిశు మరణాలపై నిగ్గుతేల్చాలి.





**ముంచంగిపుట్టు, పెన్ పవర్, నవంబరు15.**నెలరోజుల వ్యవధిలోనే ఐదు శిశు మరణాలు సంభవించడంతో తీవ్ర భయాందోళనలో ప్రజలు ఉన్నారు. అల్లూరి జిల్లా ముంచంగిపుట్టు మండలం, దారెల పంచాయతీ, తలింబ గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారులు, కుమ్మరిపుట్టుకు చెందిన ఇద్దరు చిన్నారులతో పాటు చీవుకుచింత గ్రామానికి చెందిన ఒక శిశువు రెండు మూడు నెలల వయసులోనే నెలరోజుల వ్యవధిలోనే మృతి చెందటంతో ఆయా గ్రామస్తులు తీవ్ర భయాందోళన గురవుతున్నారు. ఈ విషయంపై వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు, ఆయా గ్రామాలలో పర్యటించి, శిశు మరణాలకు గల కారణాలు అధ్యయనం చేయాలని శనివారం స్థానిక సర్పంచ్ పాంగి పాండురంగస్వామి అన్నారు. ఆయా గ్రామాల కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి ధైర్య పరిచారు. ఈ సందర్భంగా ఆయా గ్రామస్తులు మాట్లాడుతూ.. నెల రోజుల వ్యవదిలో ఐదుగురు చిన్నారులు మృతి చెందినప్పటికీ ప్రభుత్వంగానీ వైద్యాధికారులు గాని గ్రామాల్లో పర్యటించకపోవడం విచారకరమన్నారు. చిన్నారులు ఎందుకు మృతి చెందుతున్నారో తెలియని పరిస్థితి నెలకొందని ఇప్పటికైనా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆయా గ్రామాల్లో పర్యటించి శిశు మరణాలపై అధ్యాయనం చేసి నిగ్గు తేల్చాలన్నారు. శిశు మరణాలు సంభవించకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలనిఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో కే ప్రభు, పి కామేష్, గౌరీ శంకర్ శ్రీకాంత్ సుబ్బారావు, గోపాలం, కార్తీక్ లు పాల్గొన్నారు.

# పదవి పొందిన వారితో పాటుగా ప్రతీ కార్యకర్త ముఖ్యమే..

ఎమ్మెల్యే నెహ్రూ





**జగ్గంపేట, పెన్ పవర్, నవంబరు 15**: పార్టీలో పదవి పొందిన వారితో పాటుగా మిగిలిన కార్యకర్తలు అందరూ కూడా సమానమేనని నియోజకవర్గ టిడిపి కార్యకర్తలు అంతా కుటుంబ సభ్యులుగా మెలగాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేట పరిణయ ఫంక్షన్ హాల్లో శనివారం జగ్గంపేట నియోజకవర్గ మండల, క్లస్టర్, యూనిట్, డివిజన్, బూత్ కమిటీల సభ్యులు 2632 మంది ప్రమాణస్వీకారోత్సవం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ రాజశేఖర్, కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్, నియోజకవర్గ పరిశీలకులు వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా జగ్గంపేట మండలాధ్యక్షుడిగా జీను మణిబాబు, గండేపల్లి మండలాధ్యక్షుడిగా పోతుల మోహనరావు, కిర్లంపూడి అధ్యక్షుడిగా వీరంశెట్టి కాశీబాబు, గోకవరం మండలాధ్యక్షుడి పి.చంటిబాబు, అలాగే అనుబంధ కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ముందుగా టీడీపీ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీగా సభాస్థలికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరించారు. పార్టీ కోసం పనిచేసే ప్రతీ ఒక్కరికీ పదవులు వరిస్తాయన్నారు. ఎన్నికైన అధ్యక్షులు భవిష్యత్తులో తీసుకోవాల్సిన కర్తవ్యాలను నిర్దే శించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రత్తిపాడు సబ్‌జైలును సందర్శించిన న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ గోపీనాథ్

## వసతుల పరిశీలన -ఖైదీల సంక్షేమంపై ఆరా



**ప్రత్తిపాడు, పెన్ పవర్, నవంబర్ 15 :** మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎల్. గోపీనాథ్ శనివారం ప్రత్తిపాడు సబ్‌జైలును సందర్శించారు. ఖైదీలకు అందుతున్న వసతులు, సేవలు, వారి హక్కుల రక్షణలో న్యాయ సేవాధికార సంస్థ చేపడుతున్న కార్యక్రమాలపై విశదీకరణ ఇచ్చారు. ఖైదీల న్యాయ సహాయానికి ఎల్ఎస్ఏ ఏ విధంగా ముందుంటుందో, ఉచిత న్యాయసహాయం పొందే విధానాన్ని ఖైదీలకు వివరించారు.

సందర్శన సందర్భంగా వంటశాల, ఖైదీలు నివసించే గదులు, పరిశుభ్రత, తాగునీటి సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లను గోపీనాథ్ సమగ్రంగా పరిశీలించారు. ఖైదీల కోసం ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టెను తెరిపించి పరిశీలించగా ఎలాంటి ఫిర్యాదులు నమోదు కాలేదని గుర్తించారు. సబ్‌జైలులో పరిస్థితులు సంతృప్తికరంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్ వెంకట శివన్నారాయణ, సబ్‌జైలు సిబ్బంది పాల్గొన్నారు. న్యాయ సేవాధికార సంస్థ తరపున ఖైదీల హక్కుల పరిరక్షణ, న్యాయసహాయం అందించడంలో మరింత చురుగ్గా పనిచేయనున్నట్లు చైర్మన్ అన్నారు.



# డిసెంబర్ 13న జాతీయ లోక్‌అదాలత్ కక్షిదారులు సద్వినియోగం చేసుకోండి :

## అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాషా



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, నవంబర్ 15 :** జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాషా సూచించారు. శనివారం అదనపు జిల్లా జడ్జి కోర్టులో జడ్జీలు, న్యాయవాదులతో సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడారు.

డిసెంబర్ 13 (శనివారం) లోక్‌అదాలత్ జరుగుతుందని తెలిపారు.

రాజీ పడదగిన సివిల్ దావాలు, ఈపీలు, ఎస్ఐ యాక్టు కేసులు, చెక్ బౌన్స్ కేసులు, భార్యాభర్త గొడవలు, చిన్నపాటి కోర్టల్ కేసులు, బ్యాంకు కేసులు వంటి వాటిలో పెద్ద ఎత్తున రాజీలు చేయవచ్చని చెప్పారు.

కేసులు రాజీ అయితే సమయం, సొమ్ములు ఆదా అవుతాయి, కోర్టు ఫీజు రిఫండ్ అందుతుందని తెలిపారు.

కోర్టు చుట్టూ తిరగకుండానే సమస్యలు పరిష్కారం అవుతాయి అన్నారు.

రాజీ పడని కేసుల్లో ఫైనల్ అవార్డు ఇస్తారు. ఆ అవార్డుపై అప్పీలు ఉండవు అని వివరించారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె. మాధవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. సూర్యకిరణ్ శ్రీ, 1వ అదనపు సివిల్ జడ్జి కె. లలితా దేవి, 2వ అదనపు సివిల్ జడ్జి ఈ. అన్నామణి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# చలమలశెట్టి సునీల్ కు చదలవాడ బాబీ పరామర్శ.



**కిర్లంపూడి,పెన్ పవర్,నవంబర్ 15:**ప్రముఖ పారిశ్రామికవేత్త చలమలశెట్టి సునీల్ కు చదలవాడ బాబి శనివారం పరామర్శించారు. ఆయన తండ్రి,ప్రసిద్ధ వైద్యులు డాక్టర్ చలమలశెట్టి సురేంద్రనాథ్ ఇటీవల మృతి చెందారు. దీంతో కిర్లంపూడి సొసైటీ మాజీ అధ్యక్షుడు చదలవాడ బాబీ శనివారం మచిలీపట్నంలో సురేంద్రనాథ్ సంతాప సభకు హాజరై ఘన నివాళులర్పించి,వారి కుమారులు చలమలశెట్టి సునీల్,చలమలశెట్టి అనిల్,చలమలశెట్టి వెంకటేశ్ లను పరామర్శించి కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.ఈ సందర్భంగా బాబీ మాట్లాడుతూ డాక్టర్ సురేంద్రనాథ్ వైద్య వృత్తిని కేవలం ఉపాధిగా కాకుండా సమాజ సేవగా భావించి ఎన్నో సంవత్సరాలు ప్రజలకు అంకితభావంతో ఉచిత సేవలందించారన్నారు.ఆయన చూపిన మానవతా దృక్పథం, ప్రజల పట్ల చూపిన మమకారం ఎప్పటికీ మరువలేనివన్నారు.ఆయన సేవలు ప్రజల హృదయాలలో చిరస్మరణీయంగా నిలుస్తాయన్నారు.వారి పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నానని బాబీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బాబీతో పాటు అయన అనుచరులు పాల్గొన్నారు.

# జగ్గంపేటలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర




**జగ్గంపేట, పెన్ పవర్, నవంబర్ 15:** జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట ఎంపీడీవో వైవివిఎన్ఎస్ లక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యక్తిగత, పరిసరాలు పరిశుభ్రత మరియు బహిరంగ మల మూత్ర విసర్జన నిర్మూలనపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ, జగ్గంపేట పంచాయతీ కార్యదర్శి శివ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# పరిసరాలను మనమే పరిశుభ్రంగా ఉంచుకోవాలి

* ఆగడాల లంక కార్యదర్శి సోములు




**ఏలూరు నవంబర్ 15 పెన్ పవర్:** మన పరిసరాలను మనమే పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉంగుటూరు నియోజకవర్గం భీమడోలు మండలం ఆగడాల లంక పంచాయతీ కార్యదర్శి బి సోములు అన్నారు. శనివారం గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో స్వచ్ఛ దివస్ ర్యాలీని నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేయించారు. గ్రామం పరిశుభ్రంగా ఉండే విధంగా కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ దివ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. మన గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు, మన కార్యాలయాలు, ఈ ఏర్పాటు జరిగిందన్నారు. గ్రామంలోని విధులు ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండే విధంగా అందరూ కలిసి కట్టుగా పారిశుధ్య కార్యక్రమాలు ఏర్పాటు చేసుకునే విధంగా కూటమి ప్రభుత్వం చొరవ చూపిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, పంచాయతీ కార్యదర్శి సోములు,సచివాలయం సిబ్బంది, పారిశుధ్య కార్మికులు ప్రజలు పాల్గొన్నారు.

# శ్రీ భూ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో భారీ అన్నదాన కార్యక్రమం

* ప్రముఖ పారిశ్రామికవేత్త సంపర సుధాకర్ శ్రీ వినాయక వర్మ ఆర్థిక సహాయంతో..



**కిర్లంపూడి,పెన్ పవర్,నవంబర్,15:**కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం చిల్లంగి శ్రీనివాసా నగరంలో వేంచేసియున్న శ్రీ భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ప్రముఖ పారిశ్రామికవేత్త సంపర సుధాకర శ్రీ వినాయక వర్మ ఆర్థిక సహాయంతో వారి కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో సుమారు 5,000 మందికి అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ అన్నదాన కార్యక్రమంలో చిల్లంగి ,జగపతినగరం, కిర్లంపూడి చుట్టు ప్రక్కల గ్రామాలకు చెందిన అధిక సంఖ్యలో భక్తులు భారీగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని అన్న ప్రసాదములు స్వీకరించారు. కార్తీక మాసం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈఅన్నదాన కార్యక్రమం చేపట్టడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. స్వామివారికి ముందుగా విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు అనంతరం ఈ అన్నదాన కార్యక్రమం సంపర సుధాకర శ్రీ వినాయక వర్మ చేతుల మీదుగా ప్రారంభించారు . ఆలయ కమిటీ సభ్యులు భక్తులు రాక కోసం భారీ ఏర్పాట్లు చేశారు.ఈ సందర్భంగా సంపర సుధాకర శ్రీ వినాయక వర్మ మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమము నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని,ఇది నా పూర్వ జన్మ సుకృతం అని ఈ కార్యక్రమానికి అవకాశం కల్పించిన ఆలయం కమిటీ సభ్యులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ అన్నదాన కార్యక్రమం దిగ్విజయంగా నిర్వహించేందుకు సహకరించిన నా తోటి స్నేహితులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, సుధాకర్ స్నేహితులు, చిల్లంగి, కిర్లంపూడి, జగపతినగరం గ్రామాలకు చెందిన పలువురు పెద్దలు పాల్గొనడమే కాకుండా, సుధాకర్ అందిస్తున్న సేవలను కొనియాడారు.

# కీలక మలుపులు తిరుగుతున్న పరకామణికేసు



**తిరుమల, నవంబర్ 15, పెన్ పవర్:** :తిరుమల పరకామణి చోరీ కేసులో కీలక ఫిర్యాదుదారు సతీష్ కుమార్ అనుమానాస్పదంగా చనిపోయారు. ఆయన మాజీ అసిస్టెంట్ విజిలెన్స్ సెక్యూరిటీ ఆఫీసర్ (ఏవీఎస్ఓ). ఈ ఘటన నవంబర్ 13, 2025న జరిగింది.
అనంతపురం జిల్లా తాడిపత్రి సమీపంలోని కోమలి గ్రామం వద్ద రైల్వే ట్రాక్ మీద ఆయన మృతదేహం దొరికింది. సతీష్ కుమార్ వయసు 45 సంవత్సరాలు. తిరుపతి సమీపంలో నివసించేవారు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఉదయం 7 గంటల సమయంలో స్థానికులు మృతదేహాన్ని చూశారు. రైలు ఢీకొని చనిపోయినట్లు కనిపించినా, శరీరంపై గాయాలు అసహజంగా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. తాడిపత్రి పోలీసులు అనుమానాస్పద మరణం కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టంకు తరలించారు. ఫోరెన్సిక్ బృందం పరిశీలిస్తోంది. కుటుంబ సభ్యులు ఆత్మహత్య కాదని, హత్యే అని చెబుతున్నారు. పరకామణి చోరీ కేసు 2023 ఏప్రిల్‌లో మొదలైంది. భక్తులు సమర్పించిన బంగారు, నగలు, విదేశీడాలర్లను రవికుమార్ అనే పెద్దజీయర్ మఠం ఉద్యోగి దొంగిలిస్తూండగా పట్టుకున్నారు. ఆయనపై సతీష్ కుమార్ మొదటి ఫిర్యాదు చేశారు. పెద్ద జీయర్ మఠం గుమస్తా రవి కుమార్ 920 అమెరికన్ డాలర్లు దొంగిలిస్తూ దొరికిపోయారని కేసు నమోదు చేశారు. అయితే ఆ తర్వాత ఆయన రవికుమార్ తో లోక్ అదాలత్ లో రాజీ చేసుకున్నారు. దొంగతో రాజీ చేసుకోవడం ఏమిటన్న విమర్శలు వచ్చాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ విషయం వెలుగులోకి వచ్చింది. 2025 అక్టోబర్‌లో హైకోర్టు ఆదేశంతో సీఐడీ దర్యాప్తు మొదలైంది. సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలో బృందం విచారణ ప్రారంభించారు. రవికుమార్ ఆస్తులను కొన్ని టీటీడీ పేరన రిజిస్టర్ చేసి..మిగతా పెద్ద మొత్తంలో ఆస్తులను ఇతర వైసీపీ నేతలు, అప్పటి టీటీడీ అధికారులు స్వాహా చేశారని ఆరోపణలు ఉన్నాయి. సతీష్ కుమార్‌ను నవంబర్ 6న తిరుపతి పద్మావతి అతిథి గృహంలో విచారించారు. మరోసారి హాజరు కావాలని నోటీసు ఇచ్చారు. ఆ తర్వాతే ఆయన చనిపోయారు. దీంతో హత్య అనుమానం పెరిగింది. సతీష్ మొబైల్, వాహనం ఇతర విషయాలను సీఐడీ అధికారులు పరిశీలిస్తున్నారు.సతీష్ కుమార్ ను ఎవరైనా హత్య చేశారా.. పరకామణి కేసులో ఆయన ఎవరి ఒత్తిడితో రాజీ చేసుకున్నారు.. రవికుమార్ ఆస్తులను ఎవరెవరు రాయించుకున్నారన్నది ఆయనకు తెలిసే అవకాశం ఉంది. ఒత్తిడి చేసిన పెద్దలే.. అసలు నిందితులు అవుతారు. ఆ విషయాలన్నీ సతీష్ కుమార్ బయట పెడితే.. కేసు చిక్కుముడి వీడిపోతుంది. ఇలాంటి సమయంలో ఆయన అనుమానాస్పదంగా మృతి చెందడం సంచలనంగా మారింది

# డ్రోన్ ట్యాక్సీలు...

**కర్నూలు, నవంబర్ 15, పెన్ పవర్:** ఏపీవాసులకు సీఎం చంద్రబాబు శుభవార్త వినిపించారు. ఏపీలో త్వరలోనే డ్రోన్ ట్యాక్సీలను అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. విశాఖ సీఐఐ సదస్సులో మాట్లాడిన చంద్రబాబు.. డ్రోన్ ట్యాక్సీలపై కీలక వ్యాఖ్యలు చేశారు. మరోవైపు ఏపీలో డ్రోన్ సిటీ, స్పేస్ సిటీలకు వర్చువల్‌గా శంకుస్థాపన జరిగింది. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో డ్రోన్ సిటీ.. తిరుపతి, సత్యసాయి జిల్లాలలో స్పేస్ సిటీలను అభివృద్ధి చేయనున్నారు. సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది.విశాఖపట్నం వేదికగా జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన చేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి త్వరలోనే డ్రోన్ ట్యాక్సీలను ప్రారంభిస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఏపీని పెట్టుబడులకు గేట్ వేగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. మరోవైపు సీఐఐ సదస్సుకు 72 దేశాల నుంచి 522 మంది ప్రతినిధులు హాజరయ్యారు. అలాగే 2,500 మంది పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన చంద్రబాబు.. ఏపీ ప్రభుత్వం టెక్నాలజీ రంగం అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఈ క్రమంలోనే ఏరో స్పేస్, డ్రోన్, డిఫెన్స్ కారిడార్లను ఏర్పాటు చేస్తున్న సంగతిని చంద్రబాబు వివరించారు. మరోవైపు చంద్రబాబు ప్రకటన తర్వాత డ్రోన్ ట్యాక్సీ అంటే ఏమిటనే దానిపై చర్చ మొదలైంది.డ్రోన్ ట్యాక్సీ అనేది ఓ ఎలక్ట్రిక్ ఎయిర్ క్రాఫ్ట్. ఇది రిమోటెడ్‌గా లేదంటే స్వయంగా పనిచేస్తుంది. డ్రోన్ ట్యాక్సీ సాయంతో ప్రయాణికులను, సరుకులను రవాణా చేస్తుంటారు. డ్రోన్ ట్యాక్సీనే ఎలక్ట్రిక్ వర్టికల్ టేకాఫ్ అండ్ ల్యాండింగ్ వెహికల్ అని పిలుస్తుంటారు. రవాణాకు వేగవంతమైన, సమర్థవంతమైన ప్రత్యామ్నాయాన్ని అందించేందుకు ప్రపంచంలోని పలు దేశాలు ఈ డ్రోన్ ట్యాక్సీలను అభివృద్ధి చేస్తున్నాయి. చైనా వంటి కొన్ని దేశాలలో ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి.మరోవైపు డ్రోన్ టాక్సీలు హెలికాప్టర్ల మాదిరిగానే పనిచేస్తాయి. అయితే పైలెట్ సాయం లేకుండానే తక్కువ దూరం ప్రయాణాలకు ఇవి ఉపయోగపడుతుంటాయి. ప్రయాణికులకు ఒకచోట నుంచి మరోచోటకు వేగంగా తీసుకెళ్లటంలో డ్రోన్ ట్యాక్సీలు ఉపయోగపడుతున్నాయి. ఇవి అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ కష్టాలకు కూడా చెక్ పెట్టొచ్చని అధికారులు చెప్తున్నారు.మరోవైపు ఏపీలో డ్రోన్ సిటీ, స్పేస్ సిటీలకు శుక్రవారం శంకుస్థాపన జరిగింది. విశాఖపట్నం సీఐఐ సదస్సు వేదికగా సీఎం నారా చంద్రబాబు నాయుడు. కేంద్రమంత్రి పీయూష్ గోయెల్ చేతుల మీదుగా వర్చువల్‌గా ఈ కార్యక్రమం జరిగింది. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో డ్రోన్ సిటీని నిర్మించనున్నారు. మొత్తంగా 300 ఎకరాల్లో డ్రోన్ సిటీ నిర్మాణం జరగనుంది. ఓర్వకల్లు డ్రోన్ సిటీలో టెస్టింగ్- సర్టిఫికేషన్ సెంటర్లు ఏర్పాటుచేస్తారు.అలాగే 25 వేల మందికి ట్రైనింగ్ ఇచ్చేలా సౌకర్యాలు కల్పిస్తారు. ఇక తిరుపతి, శ్రీసత్యసాయి జిల్లాల్లో స్పేస్ సిటీ ఏర్పాటు చేయనున్నారు. స్పేస్ సిటీ వలన 10 సంవత్సరాలలో రూ.25వేల కోట్లు పెట్టుబడులు వస్తాయని అంచనా. అలాగే 35 వేల మందికి ఉపాధి లభిస్తుందని అధికారులు చెప్తున్నారు. ఈ డ్రోన్ సిటీ , స్పేస్ సిటీలకు కేంద్రం సహకరించాలని చంద్రబాబు కోరారు.

## ఎల్ఆర్ఎస్ కు జనవరి 23 వరకు గడువు

**విజయవాడ, నవంబర్ 15, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లేఔట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) గడువును వచ్చే ఏడాది జనవరి 23 వరకు పొడిగించింది. అనధికారిక ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవడానికి ఇది మంచి అవకాశం. 2025 జూన్ 30కి ముందు కొనుగోలు చేసిన ప్లాట్లకు ఈ పథకం వర్తిస్తుంది. ఇంటి స్థలాలకు ఓపెన్ స్పేస్ ఛార్జీలో 50% రాయితీ కూడా అందిస్తున్నారు. ఈలోపు అనధికారికంగా ఉన్న ప్లాట్లను క్రమబద్ధీకరించుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. ఎల్ఆర్ఎస్ ద్వారా అనధికార లేఔట్లలో స్థలాలు కొన్న వారికి మంచి అవకాశం వచ్చిందనే చెప్పాలి. కొంతమంది అమాయకంగా అనుమతులు లేని లేఔట్‌లలో స్థలాలు కొనుగోలు చేసి మోసపోతున్నారు. ఈఎంఐ ఆప్షన్, తక్కువ ధరకు వస్తుందని కొనుగోలు చేయడం వల్లే ఇలా జరుగుతోంది. వారికి కూడా ఎల్ఆర్ఎస్‌తో ఎంతో ఉపయోగం.ఇలా అనధికారిక లేఔట్‌లో స్థలాలు కొనుగోలుచేసేవారు ఎల్ఆర్ఎస్ వినియోగించుకోవచ్చు. ఏపీ ప్రభుత్వం 2025 జూన్ 30కి ముందు కొనుగోలు చేసిన ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవడానికి అవకాశం కల్పించింది. వాస్తవానికి ఎల్ఆర్ఎస్ గడువు ఈ ఏడాది అక్టోబర్ 23 పూర్తైంది.. కానీ మరోసారి 2026 జనవరి 23 వరకు పొడిగించింది. దీని కోసంఎల్‌టీపీ (లైసెన్స్డ్ టెక్నికల్ పర్సన్) ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. ప్రభుత్వం చెప్పిన పీనలైజేషన్, ఇతరత్రా ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది.స్థలం మీదే మీకు హక్కు ఉందని చూపించడానికి, 2025 జూన్ 30 లోపు రిజిస్ట్రేషన్ పత్రాలను తప్పనిసరిగా సమర్పించాలి. ఈ పత్రాలతో పాటు, మీ స్థలం ఎంత ఉందో, దాని చుట్టూ ఏమున్నాయో, పక్కనున్న రోడ్లు ఎంత వెడల్పు ఉన్నాయో తెలిపే సైట్ ప్లాన్‌ను కూడా జతచేయాలి. అంతేకాకుండా, సబ్‌రిజిస్ట్రార్ సంతకం చేసిన ఈసీ మరియు మార్కెట్ విలువ సర్టిఫికెట్ కూడా అవసరం. భూమిని ఒక అవసరం నుంచి మరో అవసరానికి మార్చినట్లు తెలిపే ల్యాండ్ యూజ్ కన్వర్షన్ సర్టిఫికేట్ కూడా చూపించాలి. వీటితో పాటు, ఏదైనా నష్టం జరిగితే బాధ్యత వహిస్తామని తెలిపే ఇండెమ్నిటీ బాండ్, రోడ్డు విస్తరణ కోసం చేసుకున్న ఒప్పంద పత్రం కూడా ఇవ్వాల్సి ఉంటుంది. ఈ పత్రాలన్నీ సమర్పించడం ద్వారా స్థలంపై మీ యాజమాన్యాన్ని ధృవీకరించుకోవచ్చు.ఒకవేళ ఎల్ఆర్ఎస్ కింద ఇంటి స్థలాలు క్రమబద్ధీకరించుకుంటే.. వారికి ప్రభుత్వం బంపరాఫర్ ప్రకటించింది. ఓపెన్ స్పేస్ ఛార్జీలో 50% రాయితీ ఇస్తోంది. ఖాళీ స్థలాలపై నిబంధనల ప్రకారం 14% ఛార్జీలు ఉంటే.. ప్రస్తుతం 7% చెల్లిస్తే సరిపోతుంది. ఈ దరఖాస్తులు భారీగా వస్తాయని అంచనా వేస్తున్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని.. ప్రభుత్వం మరోసారి గడువు పెంచే అవకాశం లేదంటున్నారు. ఒకవేళ క్రమబద్ధీకరించుకోకపోతే ఇబ్బందులు ఎదురవుతాయంటున్నారు. అనధికారిక లేఔట్లలో నిర్మాణాలు చేపట్టాలంటే ప్రభుత్వం అనుమతి ఇవ్వదు. ఒకవేళ ఎవరైనా అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టినా చట్టవిరుద్ధం.. వాటిని కూల్చేస్తారు. అమ్మకాలు, కొనుగోలుకు ఛాన్స్ లేకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిషేధిత భూముల జాబితాలో చేర్చేస్తారు. అలాగే ఖాళీ స్థలాలకు వీఎల్‌టీ (వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్) వేయరు. ఒకవేళ ఇల్లు నిర్మించుకోవాలనుకుంటే.. బ్యాంకుల నుంచి రుణాలు కూడా రావు. తాత్కాలిక నిర్మాణాలకు కూడా నంబర్లు ఇవ్వరు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు ఆ లేఔట్లలో మౌలిక సదుపాయాలు కల్పించదు.

# సత్తా చాటిన విశాఖ పోర్టు

**విశాఖపట్టణం, నవంబర్ 15, పెన్ పవర్:**
విశాఖ పోర్టు సత్తా చాటింది. స్వచ్ఛత కార్యక్రమాల్లో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. 2024 ఏడాదికి గానూ.. ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రి సర్బానంద సోనోవాల్ చేతుల మీదుగా అవార్డు అందుకుంది. విశాఖ పోర్టు అథారిటీ.. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ, మొక్కలు నాటడం, సఫాయి మిత్రసురక్ష వంటి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసిందని పోర్టు చైర్మన్ ఎం అంగముత్తు తెలిపారు. గతేడాది మూడో స్థానంలో నిలిచిన విశాఖ పోర్టు.. ఈసారి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది.విశాఖపట్నం పోర్టు సత్తా చాటింది. స్వచ్ఛ కార్యక్రమాల్లో విశాఖ పోర్టు అథారిటీ .. దేశంలోని పరిశ్రమల విభాగంలో మొదటి స్థానంలో నిలిచింది. దేశవ్యాప్తంగా ఉన్న మేజర్ పోర్టులతో పోటీపడీ మరీ తొలి స్థానంలో నిలిచింది. ముంబయిలో జరిగిన కార్యక్రమంలో ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రి సర్బానంద సోనోవాల్.. విశాఖ పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం అంగముత్తుకు స్వచ్ఛత అవార్డు ప్రదానం చేశారు. కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన స్వచ్ఛత పఖ్వాడ అవార్డ్స్ కార్యక్రమంలో.. 2024 ఏడాదికి గానూ విశాఖ పోర్టుకు ఈ అవార్డు లభించింది.అవార్డు తీసుకున్న సందర్భందా ఎం అంగముత్తు మాట్లాడారు. పోర్టులో పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. కేంద్రం సూచించిన విధంగా మొక్కలు నాటించి, సఫాయి మిత్రసురక్ష వంటి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేశామని తెలిపారు. కాగా స్వచ్ఛత పఖ్వాడ అవార్డ్స్ 2023 ఎడిషన్‌లో.. విశాఖ పోర్టు జాతీయ స్థాయిలో మూడవ స్థానాన్ని దక్కించుకుందని తెలిపారు. ఈసారి ప్రధాన ఓడరేవులతో పోటీ పడి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుందన్నారు. స్వచ్ఛత మిషన్ పట్ల వీపీఏ నిబద్ధతకు ఈ అవార్డు నిదర్శనం అని చెప్పారు. దాని వల్లే వీపీఏ.. 2024లో



అగ్రస్థానానికి చేరుకుందన్నారు.ఈ స్వచ్ఛత అవార్డు.. పర్యావరణ సంరక్షణ, స్థిరమైన ఓడరేవు కార్యకలాపాల్లో.. విశాఖ పోర్టు నాయకత్వాన్ని బలోపేతం చేసిందని అంగముత్తు పేర్కొన్నారు. ఉద్యోగులు, వ్యాపార భాగస్వాములు, పీపీపీ నిర్వాహకులు, కార్మిక సంఘాల నాయకుల సహాయ, సహకారాలతో ఇలాంటి లక్ష్యాలు సాధిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోర్టు కార్యదర్శి టి వేణుగోపాల్, చీఫ్ ఇంజినీర్ ఎస్ఎస్ఆర్‌సీ మూర్తి, సీఎంఈ రాంప్రసాద్, సీఎంఓ డాక్టర్ ఎస్ ఉషాదేవి తదితరులు పాల్గొన్నారు.మరోవైపు, గతేడాది విశాఖపట్నం పోర్టు సరికొత్త రికార్డు సృష్టించింది. సరుకు రవాణాకు సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరంలో.. 249 రోజులకు గానూ 55 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు రవాణా చేసినట్లు ఎం అంగముత్తు తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తంలో 81.09 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు విశాఖ పోర్టు ద్వారా రవాణా చేశామన్నారు. విశాఖపట్నం పోర్టు చరిత్రలో ఇదే ఇప్పటి వరకూ అత్యధికమని వెల్లడించరారు. అయితే ఈ క్రమంలోనే 2024-25 ఆర్థిక సంవత్సరంలో 90 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు రవాణా చేయాలని విశాఖపట్నం పోర్టు లక్ష్యంగా పెట్టుకుంది. అయితే 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసే సరికి 82.62 టన్నుల సరుకు రవాణా చేసింది. గతేడాది కంటే ఇది 6 శాతం ఎక్కువ.

# సీఐఐ సదస్సులో కనిపించని మిత్రపక్షాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** విశాఖలో పెట్టుబడుల సదస్సు ప్రారంభం అయింది. ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేసింది. ఆంధ్ర యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ వేదికగా ఈ సదస్సు రెండు రోజులపాటు కొనసాగుతోంది. ప్రపంచం నలుమూలల నుంచి దిగ్గజ పారిశ్రామికవేత్తలు పెద్ద ఎత్తున తరలిరానున్నారు. గత కొంతకాలంగా ఏపీ ప్రభుత్వం ఈ సదస్సుకు సన్నాహాలు ప్రారంభించింది. సీఎంతో పాటు మంత్రులు స్వయంగా వెళ్లి ఆహ్వానాలు అందించారు. దాదాపు పది లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. అయితే ఇంతటి ప్రతిష్టాత్మక కార్యక్రమానికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రావడం లేదా? అనే వార్త హల్చల్ చేస్తోంది. పౌర సంబంధాల శాఖ విడుదల చేసిన అతిథుల జాబితాలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేరు లేకపోవడం ఇప్పుడు హాట్ టాపిక్ అవుతుంది. అసలు పవన్ వస్తారా? రారా? అనేది స్పష్టత లేకుండా పోయింది. గత కొద్ది రోజులుగా అటవీ శాఖ భూముల పరిశీలనతో పాటు ఎర్రచందనం నిల్వలను పరిశీలించారు పవన్ కళ్యాణ్. ఏకంగా వైసీపీ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆక్రమించిన భూముల వీడియోలను తీసి మంత్రివర్గ సహచరులకు చూపించారు. గత రెండు రోజులుగా రాజకీయంగా సైతం హాట్ టాపిక్ అవుతున్నారు.అయితే కూటమి ప్రభుత్వ విధానాలు చూస్తుంటే ఒక అంశం స్పష్టంగా కనిపిస్తుంది. సీఎం చంద్రబాబు ప్రభుత్వాన్ని సాఫీగా నడుపుతున్నారు. పవన్ కళ్యాణ్ రాజకీయంగా డ్యామేజ్ జరిగినప్పుడు బయటకు వస్తున్నారు. అటు లోకేష్ తెలుగుదేశం పార్టీ బాధ్యతలను తన శాఖ ప్రగతి, ఏపీకి పెట్టుబడులు, విదేశీ వ్యవహారాలను చూస్తున్నారు. ఈ ముగ్గురు నేతలు ఇలా కీలక బాధ్యతల్లో



సర్దుబాటు అయ్యారు. పవన్ కళ్యాణ్ కదలికలు చూస్తే ఆయన గ్రామీణ ప్రాంత అభివృద్ధి, పర్యటనలు చేస్తున్నారు. అయితే విదేశాల నుంచి పరిశ్రమలతో పాటు పెట్టుబడులు తెచ్చే బాధ్యతను లోకేష్ తీసుకున్నారు. అయితే ఈ విషయంలో చక్కటి సమన్వయం కనిపిస్తోంది. విభిన్న ప్రకటనలు, నిర్ణయాలు ప్రకటించక పోవడాన్ని మనం గుర్తించాలి. ముఖ్యంగా ఇది అనుకునే చేస్తున్నదే.విశాఖ పెట్టుబడుల సదస్సుకు సంబంధించి ప్రభుత్వం పౌర సంబంధాల శాఖ ద్వారా భారీగా ప్రకటనలు ఇచ్చింది. అయితే ఈ యాడ్లలో ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఫోటోలు ఉన్నాయి. సీఎం చంద్రబాబు ఈ ప్రకటన ఇస్తున్నట్టు అందులో ఉంది. మరి ప్రకటనల్లోనే పవన్ కళ్యాణ్ కు అంత ప్రాధాన్యం ఉంటే.. కచ్చితంగా ఆయన సదస్సుకు హాజరవుతారని అంతా భావించారు. కానీ అతిథుల జాబితాలో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్, ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేష్, నాదేండ్ల మనోహర్, టీజీ భరత్ తో పాటు సిఐఐ కోఆర్డినేటర్ల పేర్లు మాత్రమే ఉన్నాయి. దీంతో పవన్ కళ్యాణ్ ఈ సదస్సుకు హాజరయ్యే అవకాశం లేదా అనే చర్చ నడుస్తోంది. వైసీపీ అనుకూల మీడియా అయితే దీనిని హైలెట్ చేస్తోంది. క్రమేపి పవన్ కళ్యాణ్ ని సైడ్ చేస్తున్నట్లు చెప్పుకొస్తోంది.

# వలంటీర్లు కు దీటుగా మరో వ్యవస్థ..




**విజయవాడ, నవంబర్ 15, పెన్ పవర్:**
తెలుగుదేశం పార్టీ పై ఫుల్ ఫోకస్ పెట్టారు నారా లోకేష్. ప్రస్తుతం ఆ పార్టీకి జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబు ఉన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాస్ ఉన్నారు. కానీ మంత్రి లోకేష్ మాత్రం అనధికారికంగా పార్టీని నడుపుతున్నారు. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా తెలుగుదేశం పార్టీలో సుదీర్ఘకాలం ఉండి.. పోరాటం చేసిన వారికి మాత్రమే నామినేటెడ్ పదవుల్లో పెద్దపీట వేశారు. పదవుల నియామకం సమయంలో వారు పార్టీకి చేసిన సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అటువంటి వారికి మాత్రమే పదవులు కట్టబెట్టారు. అయితే ఇప్పుడు సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టారు నారా లోకేష్. మండల, పంచాయితీ, క్లస్టర్, బూత్ స్థాయిలో టిడిపి కమిటీలను నియమించారు. ఆ కార్యవర్గాల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని సైతం.. పదవుల స్వీకరణ మాదిరిగా నిర్వహిస్తున్నారు. ఒక విధంగా చెప్పాలంటే పార్టీలు ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేస్తున్నట్టే. ప్రాంతీయ పార్టీలకు అది అవసరం కూడా. ఇప్పటికే బీమా సదుపాయం కల్పించి రికార్డు సృష్టించారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి ఈ బీమా వర్తింపజేసేలా చేశారు.దేశంలో చాలా ప్రాంతీయ పార్టీలు ఉన్నాయి. కానీ అవి కొద్ది రోజులకే అనేక రకాల ఇబ్బందులను ఎదుర్కొన్నాయి. అటువంటి ఇబ్బందులే తెలుగుదేశం పార్టీకి ఎదురయ్యాయి. కానీ వాటన్నింటినీ అధిగమించి ముందుకు సాగింది తెలుగుదేశం పార్టీ. దేశంలో చాలా ప్రాంతీయ పార్టీలు బలహీనం అయ్యాయి. కానీ తెలుగుదేశం పార్టీకి మాత్రం ఆ పరిస్థితి లేదు. ఎన్టీఆర్ బలమైన పునాదులు వేస్తే.. దానికి మరింత బలం జోడించారు చంద్రబాబు. ఇప్పుడు లోకేష్ తరంలో సైతం పార్టీ నిర్మాణాన్ని మరింత బలంగా చేపట్టాలని ఈ క్లస్టర్ విధానాన్ని తెరపైకి తీసుకొచ్చారు. పార్టీ అంటే అభిమానం ఉండే ప్రతి ఒక్కరిని ఇందులో భాగస్వామ్యం చేశారు.2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. ఆ పార్టీ నేతృత్వంలోని కూటమి పాలన చేస్తోంది. గత అనుభవాల దృష్ట్యా తెలుగుదేశం పార్టీకి విలువైన సమయాన్ని కేటాయిస్తున్నారు చంద్రబాబు, లోకేష్. అధికార కార్యక్రమాల కోసం ఏ జిల్లాకు వెళ్తున్న.. తగిన సమయాన్ని పార్టీ కోసం కేటాయిస్తున్నారు. పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతున్నారు. ఈ క్రమంలోనే క్లస్టర్ ఇన్చార్జిల ఆలోచన లోకేష్ కు వచ్చింది. పార్టీ విధానాలతో పాటు ప్రభుత్వ అంశాలను ప్రజల్లోకి, పార్టీ శ్రేణుల్లోకి తీసుకెళ్లేందుకు ఈ క్లస్టర్ ఎంతగానో దోహదపడుతోంది. అందుకే నామినేటెడ్ పదవుల మాదిరిగా ఈ క్లస్టర్ ఇన్చార్జిల నియామకాన్ని కూడా చేపడుతున్నారు. ఒక్క విధంగా చెప్పాలంటే వాలంటీర్ల వ్యవస్థకు ధీటుగా ఈ క్లస్టర్ వ్యవస్థ ఎంతో ప్రయోజనకారిగా మిగలనుంది.

## పంజాబ్ కింగ్స్ రిలీజ్ చేసిన ఆటగాళ్ల లిస్ట్ ఇదే.. ముగ్గురు ఆస్ట్రేలియా ఆటగాళ్లకు గుడ్ బై



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 మినీ ఆక్షన్ కు ముందు పంజాబ్ కింగ్స్ ఆస్ట్రేలియా ఆటగాళ్లను టార్గెట్ చేసింది. ఏకంగా ముగ్గురు ఆసీస్ ఆటగాళ్లను ఆ ఫ్రాంచైజీ వదిలేసుకుంది. స్టార్ ప్లేయర్ గ్లెన్ మ్యాక్స్ వెల్ తో పాటు ఆరోన్ హార్డీ, జోష్ ఇంగ్లిస్ లను రిలీజ్ చేసింది. మ్యాక్స్ వెల్, హార్డీని వదిలేసినా గత సీజన్ లో అద్భుతంగా రాణించిన ఇంగ్లిస్ ను రిలీజ్ చేయడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. 2025 ఐపీఎల్ మెగా ఆక్షన్ లో పంజాబ్ మ్యాక్స్ వెల్ నమ్మి రూ. 4.2 కోట్లకు తీసుకుంటే తొలి మ్యాచ్ లోనే డకౌటయ్యాడు. గత సీజన్ లో ఒక్క మ్యాచ్ కూడా ఆడకుండా పూర్తిగా నిరాశపరిచాడు.

స్టార్ ఆటగాడిగా ప్రతి మ్యాచ్ లో ప్లేయింగ్ 11 లో చోటు కల్పించినా తీవ్రంగా నిరాశకు గురి చేస్తున్నాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరపున 2024 ఐపీఎల్ సీజన్ లో ఒక్క ఇన్నింగ్స్ కూడా ఆడకపోగా.. 2025 లో అదే చెత్త ఫామ్ కొనసాగించాడు. దీంతో 2025 ఐపీఎల్ సీజన్ లో అతన్ని రిలీజ్ చేయక తప్పలేదు. ఆరోన్ హార్డీ విషయానికి వస్తే.. ఈ ఆసీస్ ఆల్ రౌండర్ కు ఒక్క మ్యాచ్ లో కూడా అవకాశం రాలేదు. దీంతో అతని అవసరం లేదని భావించిన జట్టు రిలీజ్ చేసింది. ఇంగ్లిస్ బాగా ఆడినప్పటికీ ఎందుకు రిలీజ్ చేసిందో తెలియాల్సి ఉంది. ఐపీఎల్ మెగా ఆక్షన్ లో పంజాబ్ ఈ ఆసీస్ వికెట్ కీపర్ ను

రూ. 2.60 కోట్ల ధరకు దక్కించుకుంది. ఇండియన్ ఫాస్ట్ బౌలర్ కుల్దీప్ సేన్ కు పంజాబ్ గుడ్ బై చెప్పింది. స్పిన్నర్ ప్రవీణ్ దూబేను కూడా రిలీజ్ చేసింది. ఐపీఎల్ 2025 సీజన్ లో పంజాబ్ కింగ్స్ అద్భుతంగా ఆడి రన్నరప్ గా నిలిచింది. శ్రేయాస్ అయ్యర్ కెప్టెన్సీలోని పంజాబ్ తిరుగులేని ఆట ఆడినా తుది పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుపై ఓడింది.

**రిటైన్ చేసిన ఆటగాళ్లు:**
శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), నేహాల్ వధేరా, ప్రియాంష్ ఆర్య, ప్రభ్‌సిమ్రాన్ సింగ్, శశాంక్ సింగ్, పైలా అవినాష్, హర్నూర్ పన్ను, ముషీర్ ఖాన్, విష్ణు వినోద్, మార్కస్ స్టోయినిస్, అజ్మతుల్లా ఒమర్జాయ్, సూర్యంష్ షెడ్జ్, మిచెల్ సింగ్, విజయ్, మిచెల్ సింగ్, విజయ్, విజయ్‌కుమార్, బార్ట్లెట్, లాకీ ఫెర్గూసన్, యుజ్వేంద్ర చాహల్, హర్‌ప్రీత్ బ్రార్

**రిలీజ్ చేసిన ఆటగాళ్లు:**
గ్లెన్ మాక్స్‌వెల్, జోష్ ఇంగ్లిస్, ఆరోన్ హార్డీ, కుల్దీప్ సేన్, ప్రవీణ్ దూబే

## 11 ఏళ్ళ అనుబంధానికి చెక్.. రూ.18 కోట్ల స్టార్ ఆల్ రౌండర్‌ను రిలీజ్ చేసిన కోల్‌కతా నైట్ రైడర్స్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 మినీ ఆక్షన్ కు ముందు కోల్‌కతా నైట్ రైడర్స్ తమ జట్టులోని జట్టు స్టార్ ఆల్ రౌండర్ కు బిగ్ షాక్ ఇచ్చింది. దశాబ్ద కాలంగా కేకేఆర్ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించిన రస్సెల్ కు ఈ సారి ఆ జట్టు ఫ్రాంఛైజీలు రిటైన్ చేసుకోవడానికి ఆసక్తి చూపించలేదు. ఈ విండీస్ ఆల్ రౌండర్ ను ఐపీఎల్ 2026 మినీ ఆక్షన్ కు ముందు రిలీజ్ చేసి ఊహించని షాక్ ఇచ్చింది. అంతర్జాతీయ క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించిన రస్సెల్.. గత సీజన్ లో ఘోరంగా విఫలమయ్యాడు. దీంతో కేకేఆర్ రస్సెల్ ను వదులుకునేందుకు సిద్ధమైంది. కోల్‌కతా నైట్ రైడర్స్ తరపున ఆండ్రీ రస్సెల్ 109 మ్యాచ్‌లు ఆడి 2593 పరుగులు చేశాడు. కేకేఆర్ తరపున బౌలింగ్ లోనూ రాణించి 122 వికెట్లు పడగొట్టాడు. రస్సెల్ జట్టులో ఉన్నప్పుడు కేకేఆర్ రెండు టైటిల్స్ కూడా గెలుచుకుంది. రస్సెల్ 2014 నుండి కేకేఆర్ జట్టు తరపున ఆడుతున్నాడు. 2025 ఐపీఎల్ మెగా ఆక్షన్ ముందు రస్సెల్ ను కేకేఆర్ రూ.18 కోట్లకు రిటైన్ చేసుకుంది. 2025 ఐపీఎల్ సీజన్ లో ఈ విండీస్ ఆల్ రౌండర్ 167 పరుగులు మాత్రమే చేసి 8 వికెట్లు పడగొట్టాడు. వయసు ఎక్కువగా ఉండడంతో పాటు ఇటీవలే అంతర్జాతీయ క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించడం రస్సెల్ కు మైనస్ గా మారింది.
2025లో అజింక్య రహానే కెప్టెన్సీలోని కేకేఆర్ జట్టు 14 మ్యాచ్‌లలో కేవలం 5 విజయాలతో పాయింట్ల పట్టికలో ఎనిమిదో స్థానంలో నిలిచింది. 2024 లో శ్రేయాస్ కెప్టెన్సీలో కోల్‌కతా నైట్ రైడర్స్ అద్భుతంగా ఆడి టైటిల్ గెలిచింది. 2025 ఐపీఎల్ సీజన్ లో కేకేఆర్ ప్లే ఆఫ్స్ కు



చేరకపోవడంతో 2026 ఐపీఎల్ సీజన్ లో కొత్త వ్యూహాలతో బరిలోకి దిగనుంది. 2026 ఐపీఎల్ సీజన్ కు ముందు కోల్‌కతా నైట్ రైడర్స్ తమ కోచింగ్ సిబ్బందిలో ఖాళీగా ఉన్న స్థానాలను భర్తీ చేసింది. జట్టుకు కొత్త ప్రధాన కోచ్ గా అభిషేక్ నాయర్ నియమించిన కేకేఆర్.. గురువారం (నవంబర్ 13) షేన్ షేన్ వాట్సన్‌ను అసిస్టెంట్ కోచ్‌గా ప్రకటించింది. తాజాగా న్యూజిలాండ్ దిగ్గజ ఫాస్ట్ బౌలర్ టిమ్ సౌథీని కొత్త బౌలింగ్ కోచ్‌గా నియమించుకున్నారు.

## ఒకే రోజు 16 వికెట్లు: సౌతాఫ్రికాను తిప్పేసిన జడేజా.. కోల్‌కతా టెస్టులో విజయం దిశగా టీమిండియా

**హైదరాబాద్ పెన్ పవర్:** కోల్‌కతా వేదికగా ఇండియా, సౌతాఫ్రికా జట్ల మధ్య జరుగుతున్న తొలి టెస్టులో రెండో రోజు వికెట్ల వర్షం కురిసింది. శనివారం (నవంబర్ 15) ఒక్క రోజే ఏకంగా 16 వికెట్లు కూలడంతో మ్యాచ్ మూడో రోజే ఫలితం రానుంది. మొదట సౌతాఫ్రికా రెచ్చిపోయి టీమిండియాను 189 పరుగులకు ఆలౌట్ చేస్తే.. ఆ తర్వాత టీమిండియా బౌలర్లు అంతకుమించి అన్నట్టుగా వికెట్ల వర్షం కురిపించి



గెలుపు దిశగా దూసుకెళ్తున్నారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్ లో 7 వికెట్ల నష్టానికి 93 పరుగులు చేసింది. క్రీజ్ లో కెప్టెన్ బవుమా (29), కార్బిన్ బాష్ (1) ఉన్నారు. ప్రస్తుతం సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్ లో 63 పరుగుల ఆధిక్యంలో ఉంది. టీమిండియాను కేవలం 189 పరుగులకే ఆలౌట్ చేసి ఫుల్ జోష్ లో రెండో ఇన్నింగ్స్ లో బ్యాటింగ్ కు దిగిన సౌతాఫ్రికాకు ఎదరు దెబ్బలు తగిలాయి. టీ విరామానికి ముందే కుల్దీప్ యాదవ్ సఫారీ ఓపెనర్ ర్యాన్ రికెల్టన్ (11) ను ఎల్బీడబ్ల్యూ రూపంలో ఔట్ చేశాడు. టీ విరామం తర్వాత తొలి ఓవర్ లోనే మార్కరం (4)ను జడేజా పెవిలియన్ కు పంపడంతో 25 పరుగులకే సౌతాఫ్రికా తమ ఓపెనర్లను కోల్పోయింది. ఇదే ఊపును కొనసాగించిన జడేజా వరుస విరామాల్లో వియాన్ ముల్డర్ (11), టోనీ డి జోర్జీ (2), ట్రిస్టన్ స్టబ్స్ (5) లను ఔట్ చేయడంతో సగం జట్టును కోల్పోయిన సౌతాఫ్రికాను కష్టాల్లో పడింది. 60 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడిన సౌతాఫ్రికాను ఒక ఎండ్ లో బవుమా పోరాడినా మిగిలిన వారు ఎవరూ సహకరించలేదు. అక్షర్ పటేల్ వికెట్ కీపర్ కైల్ వెర్రెయిన్ (9)ను ఔట్ చేస్తే.. మార్కో జాన్సెన్ (13)ను ఆట చివర్లో కుల్దీప్ పెవిలియన్ కు చేర్చాడు. ప్రస్తుతం 29 పరుగులతో బవుమా పోరాడుతున్నాడు. ఇండియా బౌలర్లలో జడేజా నాలుగు వికెట్లు తీసుకున్నాడు. కుల్దీప్ యాదవ్ రెండు.. అక్షర్ పటేల్ ఒక వికెట్ తీసుకున్నారు. బవుమా మూడో రోజు చివరి మూడు వికెట్లతో ఎలా పోరాడతాడనే దానిపై మ్యాచ్ ఫలితం ఆధారపడి ఉంది.
తొలి ఇన్నింగ్స్ లో టీమిండియా బ్యాటింగ్ లో ఘోరంగా విఫలమైంది. సఫారీ బౌలర్ల ధాటికి మన బ్యాటర్లు పెవిలియన్ కు క్యూ కట్టారు. శనివారం (నవంబర్ 15) రెండో రోజు ఆటలో బ్యాటింగ్ లో చేతులెత్తేయడంతో తొలి ఇన్నింగ్స్ లో 189 పరుగులకే ఆలౌటైంది. దీంతో తొలి ఇన్నింగ్స్ లో టీమిండియాకు కేవలం 30 పరుగుల ఆధిక్యం మాత్రమే లభించింది. 39 పరుగులు చేసిన రాహుల్ టాప్ స్కోరర్ గా నిలిచాడు. సుందర్ (29), పంత్ (27), జడేజా (27) వచ్చిన మంచి ఆరంభాలను పెద్ద స్కోర్లుగా మలచడంలో విఫలమయ్యారు. సౌతాఫ్రికా బౌలర్లలో హార్మర్ నాలుగు.. జాన్సెన్ మూడు వికెట్లు పడగొట్టారు. హార్మర్,కార్బిన్ బాష్ లకు చెరో వికెట్ దక్కింది. తొలి ఇన్నింగ్స్ లో సౌతాఫ్రికా 159 పరుగులకు ఆలౌటైంది.

## తెలుగు దర్శకుడి సలహా జాన్వీ వింటుందా?





అవును.. జాన్వీకపూర్ ని అతడు నియంత్రిస్తున్నాడు. ఫలానా పరిశ్రమలో మాత్రమే నటించాలని, తిరిగి హిందీ చిత్రసీమకు వెళ్లొద్దని సలహాలిస్తున్నాడు. సక్సెస్ కావాలంటే తెలుగు పరిశ్రమనే నమ్ముకోవాలని కూడా సూచించాడు. అయితే జాన్వీకపూర్ సదరు తెలుగు దర్శకుడి మాటలు వింటుందా? అతడు ఇచ్చిన సలహా ఏమిటి? అది నిజంగా అంత విలువైనదా? వివరాల్లోకి వెళితే..అతిలోక సుందరి శ్రీదేవి తనయ జాన్వీకపూర్ ఇటీవల పూర్తిగా తెలుగు సినిమాలపైనే ఫోకస్ చేస్తున్నట్టు అనిపిస్తోంది. దీనికి కారణం బాలీవుడ్ లో ఈ అమ్మడికి అస్సలు ఏదీ కలిసి రాకపోవడమే. ఎన్నో ఆశలు పెట్టుకున్న పరమ్ సుందరి, సన్నీ సంస్కారికి తులసీ కుమారి లాంటి చిత్రాలు ఫ్లాపులయ్యాయి. అంతకుముందు కూడా కొన్ని వరుస యావరేజ్ సినిమాలతోనే సరిపెట్టుకుంది. హిందీ చిత్రసీమలో జాన్వీ కెరీర్ ఆశించినంతగా వెలగలేదనడానికి ఇవన్నీ సంకేతాలు. జాన్వీకి ఒకదాని వెంట ఒకటిగా అవకాశాలు వచ్చినా కానీ, ఇవేవీ బ్లాక్ బస్టర్లు కావడం లేదు. అందువల్ల రష్మిక మందన్న, కియరా రేంజులో దూసుకుపోవడం ఈ అమ్మడికి కుదరడం లేదు.అయితే తెలుగు దర్శకుడు, ఓదెలా 2 ఫేం అశోక్ తేజ ఇప్పుడు జాన్వీ కపూర్ కెరీర్ జర్నీపై చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిగ్గా మారాయి. అతడి ప్రకారం .. జాన్వీ ఇప్పుడు సరైన చోటులోనే ఉంది. జాన్వీకి హిందీలో కంటే తెలుగులోనే క్రేజ్ ఎక్కువ. అతిలోక సుందరి శ్రీదేవి నటవారసురాలు గనుక ప్రజలు నెత్తిన పెట్టుకుంటారు. అందువల్ల జాన్వీ ఎదగాలని ఇక్కడ అందరూ పాజిటివ్ గా కోరుకుంటారు. అందువల్ల జాన్వీ టాలీవుడ్ అవకాశాలను వదులుకోకూడదని, ఇక్కడే కొనసాగాలని కూడా అశోక్ కోరుకున్నారు.అయితే అతడి వ్యాఖ్యలను కొందరు తప్పు పడుతున్నారు. జాన్వీ కపూర్ ని ఒకే పరిశ్రమకు కట్టుబడి ఉండాలని నియంత్రిస్తున్నారా? అని ప్రశ్నించారు. హద్దు దాటాడని కొందరు విమర్శించారు. అతడు ఆమె కెరీర్ గురించి మాట్లాడకూడదని కూడా అన్నారు.అయితే అశోక్ సలహాను జాన్వీ కపూర్ లైట్ తీసుకోకూడదు. అభిమానులూ అర్థం చేసుకోవాలి. అతిలోక సుందరి శ్రీదేవిని తెలుగు ప్రజలు తమ సొంత మనిషిగా, తమ ఇంటి ఆడపడుచుగా అభిమానించి ప్రేమిస్తారు. శ్రీదేవి కోసం చెవి కోసుకునే ఫ్యాన్స్ ఉన్నారు ఇక్కడ. మామ్ ఇప్పుడు లేకపోయినా .. తన కోసం ప్రారంభమైన అభిమాన సంఘాలు దశాబ్ధాలుగా యాక్టివ్ గా కార్యక్రమాలు చేపడుతూనే ఉన్నాయి. అందువల్ల తెలుగు రాష్ట్రాల్లో భారీ ఫ్యాన్ బేస్ జాన్వీకి అదనపు బలంగా మారుతుంది. ఒకవేళ జాన్వీకపూర్ హిందీ పరిశ్రమ మత్తులో అక్కడికి వెళ్లినా తనకు నటవారసురాళ్ల నుంచి బలమైన పోటీ ఉంది. అక్కడ గుంపులో గోవిందంలా తనను పట్టించుకునేవాళ్లు ఉండరు. ఇక్కడ అలా కాదు.. ప్రజలు జాన్వీలో శ్రీదేవిని చూసుకోవడానికి పోటీపడతారు. ఇవన్నీ జాన్వీ అర్థం చేసుకుంటుందనే భావిద్దాం.ఎన్టీఆర్ సరసన %-%దేవర-1%-%లో నటించిన జాన్వీ తదుపరి రామ్ చరణ్ పెద్దిలోను కీలక పాత్రతో మెప్పించనుంది. ఎన్టీఆర్, చరణ్ తర్వాత బన్ని, ప్రభాస్, సాయి ధరమ్ తేజ్ లాంటి హీరోలతో జాన్వీ అవకాశాలు అందుకోవడం కష్టమేమీ కాదని కూడా విశ్లేషిస్తున్నారు. చరణ్ సరసన పెద్ది చిత్రం నుంచి విడుదలైన తొలి సింగిల్ గ్లింప్స్ ఇంటర్నెట్ ని షేక్ చేస్తోంది. దేవర తర్వాత పెద్ది కూడా పెద్ద విజయం సాధించి జాన్వీకి బిగ్ బూస్ట్ నిస్తుందని అభిమానులు భావిస్తున్నారు.



ఐశ్వర్య రాజేష్ ఫ్యాషన్ స్టైల్ మనల్ని అసూయపడేలా చేస్తోంది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at H.NO: 38-4-216, MAHARANI STREET, MARRIPALEM, Visakhapatnam,Andhrapradesh-530018, Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, editorpenpower@gmail.com